Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 196 మేడ్చల్ మల్కాజ్‌గిరి 6 ఆగస్టు 2023 ఆదివారం పేజీలు : 4

## డబుల్ డెక్కర్ వచ్చేసిందోచ్!

చెన్నై : నగరవాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న డబుల్ డెక్కర్ బస్సు వచ్చేసింది. ఈ బస్సు సర్వీసుల కొనసాగింపు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ అధికారులు చెన్నైలో ట్రయల్ రన్ నిర్వహించారు. బ్రాడ్‌వే నుంచి మెరీనాతీరం, అన్నాసాలై మీదుగా ఈసీఆర్‌లో ఈ బస్సు పరుగులు పెట్టింది. దీంతో ఈ బస్సును వీక్షించిన నగరవాసులు మళ్లీ డబుల్ డెక్కర్ వచ్చేసిందంటూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇది కేవలం ట్రయల్ రన్ మాత్రమేనని, సర్వీసుల సాధ్యాసాధ్యాలను పరిశీలించి, అంచనాకు వచ్చాకే నిర్ణయం తీసుకుంటామని రవాణాశాఖ అధికారులు తెలిపారు. నిజానికి చెన్నైలో 1975 నుంచే డబుల్ డెక్కర్ బస్సులు నడిచేవి. అయితే రెండో అంతస్థులో ఎలాంటి పైకప్పు లేకుండా కొంతకాలం ఈ బస్సులు నడిచాయి.



## తెలంగాణలో సంక్షేమమే.. సంక్షోభం లేదు

హైదరాబాద్: పల్లె, పట్టణ ప్రగతిపై శాసనసభలో జరిగిన స్వల్పకాలిక చర్చకు మంత్రి కేటీఆర్ సమాధానమిచ్చారు. "తెలంగాణ నమూనా అంటే సమగ్ర, సమతుల్య, సమీకృత, సమ్మిళిత అభివృద్ధి. నేను చెప్పింది తప్పయితే వచ్చే ఎన్నికల్లో మమ్మల్ని ఓడించండి. నిజమైతే విపక్షాలకు డిపాజిట్లు రాకుండా చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. రాష్ట్ర బడ్జెట్ అంటే విపక్షాలకు జమా ఖర్చుల లెక్కలు మాత్రమే. భారాసకు బడ్జెట్ అంటే రాష్ట్ర ప్రజల జీవనరేఖ. మౌలిక వసతులపై బడ్జెట్‌లో 26శాతం ఖర్చు పెడుతున్నాం. సంక్షేమంతో పాటు మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మౌలిక వసతుల కల్పనలో గ్రామాలు, పట్టణాలకు సమప్రాధాన్యం ఇస్తున్నాం. తెలంగాణలో సంక్షేమం సముద్రమంత.. అభివృద్ధి ఆకాశమంత అని చెప్పక తప్పదు. తెలంగాణలోని ఏ పల్లెలో, పట్టణంలో చూసినా సంక్షేమం.. సంతోషమున్నది తప్ప సంక్షోభం లేదు. కాంగ్రెస్‌లో మాత్రమే సంక్షోభం ఉంది. వ్యవసాయం, పారిశ్రామిక రంగం, సేవా రంగం దూసుకుపోతున్నాయి" అని మంత్రి కేటీఆర్ వివరించారు.

**భట్టి ఉంటున్న ఇంట్లో మీటరు చెడిపోయింది..** "సీఎల్పీనేత భట్టి విక్రమార్క నీళ్లకోసం రోజుకు ఒక ట్యాంకర్ తెచ్చుకుంటున్నామని చెబుతున్నది అవాస్తవం. భట్టి గారు చాలా తెలివైన వ్యక్తి అని నాకు తెలుసు. అందుకే లెక్కలు తెప్పించాను. డ్యాక్యుమెంటరీ ఆధారాలు కూడా తీసుకొచ్చా. ఆయన బంజారాహిల్స్‌లో ఉంటున్నారు. క్యాన్ నంబర్ 061336924. భట్టి విక్రమార్క ఉంటున్న ఇల్లు రాజేందర్‌రెడ్డి అనే వ్యక్తి పేరుపై ఉంది. రోజుకు ఒక ట్యాంకర్ ఆర్డర్ చేస్తున్నట్లు మీరు చెప్పారు. మీరు చాలా బిజీగా పాదయాత్ర చేస్తున్నారు. మీరు ఉన్న ఇంట్లో మీటరు చెడిపోయింది. మీటరు ఎప్పుడు చెడిపోయిందో కూడా హెచ్ఎండబ్ల్యూఎస్ వద్ద గణాంకాలు ఉంటాయి. జనవరి 2022 నుంచి మీ ఇంట్లో మీటర్ పనిచేయడం లేదు. ఆ మీటరు బాగు చేసుకొని ఉంటే మీకు కూడా అందరిలాగే ఉచితంగా 20వేల లీటర్ల నీళ్లు వచ్చేవి. జనవరి 2022 నుంచి ఒక్క ట్యాంకర్ కూడా బుక్ చేయలేదు. మీకు తెలియదు. బుకాయించారు. అదరగొట్టేందుకు ఏదో మాట్లాడారు. ఈ రకంగా సత్యదూరం అయిన మాటలు చెప్పడం సరైన పద్ధతి కాదు. వీటిపై మీరు రేపు వివరణ ఇచ్చినా సరే" అని కేటీఆర్ కౌంటరు ఇచ్చారు.

**ఆ నాలుగు బిల్లులను మరోసారి మండలిలో ప్రవేశపెట్టిన మంత్రులు..** రాష్ట్ర గవర్నర్ తమిళిసై తిప్పి పంపిన నాలుగు బిల్లులను రాష్ట్ర మంత్రులు మరోసారి మండలిలో ప్రవేశపెట్టారు. తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ బిల్లు, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ రెగ్యులేషన్ చట్ట సవరణ బిల్లు 2022ను రీ కన్సిడరేషన్ కోసం మంత్రి హరీశ్‌రావు సభలో ప్రవేశపెట్టారు. తెలంగాణ స్టేట్ ప్రైవేట్ యూనివర్సిటీస్ ఎస్టాబ్లిష్మెంట్ అండ్ రెగ్యులేషన్ అమెండ్మెంట్ బిల్లు 2022 నుంచి సభలో రీ కన్సిడరేషన్ కోసం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు 2023ను రిఫరెన్స్ కోసం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శాసనమండలిలో ప్రవేశ పెట్టారు.



## రిపోర్ట్ వచ్చేసిందహో..!

హైదరాబాద్ : తెలంగాణలో ఎన్నికల మూడ్ వచ్చేసింది. అన్ని పార్టీలు ఎన్నికల వ్యూహరచన మొదలుపెట్టాయి. కదనరంగంలో నేతలంతా పూర్తిగా క్రియాశీలకయ్యారు. ప్రధాన పార్టీలన్నీ గెలుపు గుర్రాల కోసం వేటను కొనసాగిస్తున్నాయి. ఎక్కడెక్కడ పార్టీ పరిస్థితి ఏవిధంగా ఉందో లెక్కలుకడుతున్నాయి. ఇందుకోసం సర్వేలు చేయించుకుంటున్నాయి. తెలంగాణ ఇచ్చిన పార్టీగా ఈసారి ఎలాగైనా తెలంగాణను హస్తగతం చేసుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థుల వేట మొదలుపెట్టింది. ఈ మేరకు కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు టీమ్ సర్వే చేపట్టి కీలక రిపోర్టును ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్‌కి అందజేసింది. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై ఈ టీమ్ నివేదికను రూపొందించింది.

**రిపోర్ట్‌లో ఏముందంటే.. 119 సీట్లను 3 భాగాలుగా సునీల్ విభజన**
**A. కేటగిరీలో 41 స్థానాలు B. కేటగిరీలో 42 స్థానాలు**
**C. కేటగిరీలో 36 స్థానాలు.**

ఏ కేటగిరీలోని స్థానాలను కాంగ్రెస్ పార్టీ గన్‌షాట్‌గా గెలుచుకుంటుందని సునీల్ కనుగోలు టీమ్ అంచనావేసింది. ఇక బీ కేటగిరీలో కొంచెం కష్టపడితే గెలిచే స్థానాలుగా పేర్కొంది. సీ కేటగిరీ సీట్లలో బలహీనంగా ఉందని పేర్కొన్నారు. బీ కేటగిరీ స్థానాల్లో గెలిస్తేనే పార్టీ అధికారంలోకి వస్తుందని రిపోర్ట్‌లో సూచించారు. బీ కేటగిరీ సీట్లలో బలం పెంచుకునేందుకు పార్టీ నేతలకు సునీల్ టీమ్ దిశానిర్దేశనం చేసింది.

**ఈ నెలలోనే మొదటి జాబితా?** : మరోవైపు.. శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న కేసీ.వేణుగోపాల్‌కు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి గాంధీభవన్‌కు చేరుకుని సునీల్ టీమ్ అందజేసిన రిపోర్టుపై మేధోమథనం చేశారు. ఇదిలా ఉంటే ఈనెలలోనే మొదటి జాబితాలో కొన్ని అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు టాక్ నడుస్తోంది. అలాగే బీఆర్ఎస్‌లో కూడా ఇప్పటికే కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే సీఎం కేసీఆర్ కూడా అభ్యర్థులను ప్రకటించే ఛాన్స్ ఉందని చర్చ నడుస్తోంది.

## సెటిలర్స్ కు ప్రాధాన్యం - సినీ ఇండస్ట్రీకి భరోసా, కాంగ్రెస్ కొత్త స్కెచ్..!!

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. తెలంగాణలో గణనీయంగా ఉన్న సెటిలర్స్ ను తన వైపు తిప్పుకుంటోంది. ఇప్పుడు కొత్త వ్యూహం సిద్ధం చేస్తోంది. సెటిలర్స్ కు వచ్చే ఎన్నికల్లో ప్రాధాన్యత ఇవ్వనుంది. ఇదే సమయంలో సినీ పరిశ్రమ సమస్యలపైన కాంగ్రెస్ నేతలు కసరత్తు చేస్తున్నారు. సెటిలర్స్ తో పాటుగా సినీ పరిశ్రమకు చెందిన వారికి టకెట్లు ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించారు. అధికారంలోకి రాగానే ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇస్తున్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ కొత్త ప్రణాళికలతో సిద్ధం అవుతోంది. బీఆర్ఎస్ పై వ్యతిరేకంగా ఉన్న మెజార్టీ ఓట్ బ్యాంక్ ను తమ వైపు తిప్పుకొనే ప్రయత్నాలు చేస్తోంది.

రాజధాని హైదరాబాద్ తో పాటుగా సరిహద్దు జిల్లాలు.. నిజామాబాద్ లో సెటిలర్ల ప్రభావం ఎక్కవ. పలు నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను డిసైడ్ చేసే స్థాయిలో ఉన్నారు. గత తొమ్మిదేళ్ల కాలంలో రాజకీయంగా వారికి ఎటువంటి అవకాశాలు దక్కలేదు. హైదరాబాద్ ఇమేజ్ పెంచటంలో వారంతా భాగస్వాములుగా ఉన్నారు. వీరికి ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. వచ్చే ఎన్నికల్లో సెటిలర్లకు టికెట్లు ఇవ్వాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. అదే సమయంలో మంత్రివర్గంలోనూ స్థానం కల్పించాలని యోచిస్తోంది.



సెటిలర్లకు ప్రాధాన్యత దక్కేలా కొత్త కార్యాచరణ సిద్ధం చేస్తోంది. హైదరాబాద్ కు సినిమా పరిశ్రమ తీసుకొచ్చిన ఘనత తమదేనని కాంగ్రెస్ గుర్తు చేస్తోంది.రాష్ట్ర విభజన తరువాత సినీ పరిశ్రమ సమస్యలు..కార్మికుల కష్టాల పైన ప్రభుత్వం ఆలోచన చేయలేదు. సినీ పరిశ్రమకు నంది అవార్డులు ఇప్పటి వరకుఇవ్వని నిస్సహాయ స్థితిలో ఉంది. సినీ పరిశ్రమ ద్వారా రాష్ట్రానికి వచ్చే గుర్తింపును విస్మరించింది. సినిమా ఈవెంట్స్ కు హాజరవ్వటం మినహా..పరిశ్రమను మరింతగా వేగంగా ముందుకు వెళ్లేలా ఎటువంటి నిర్ణయాలు లేవు. ఈ సమయంలో కాంగ్రెస్ మరోసారి సినీ పరిశ్రమ పైన దృష్టి సారించింది. గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వ సమయంలోనే పరిశ్రమకు అవసరమైన భూములు... రాయితీలు..ప్రోత్సాహకాలతో అండగా నిలిచింది. దీనిని ఇప్పుడు తిరిగి కొనసాగిస్తామని చెబుతోంది. సినీ పరిశ్రమపైనా కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. సినీ ఇండస్ట్రీ నుంచి రాజకీయంగా ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహించాలని భావిస్తోంది. టికెట్ల కేటాయింపుతో పాటుగా మంత్రివర్గంలోనూ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయానికి వచ్చింది. ఎంతో కాలంగా పరిష్కారం కాకుండా పెండింగ్ లో ఉన్న సినీ కార్మికుల ఇళ్ల స్థలాల విషయంలోనూ కాంగ్రెస్ సానుకూలంగా ఉంది. ఇప్పటికే ఈ సమస్య పరిష్కారం దిశగా అభిప్రాయ సేకరణ...ఏ ఒక్క కార్మికుడికి అన్యాయం జరగకుండా స్థలాలు అందించే కార్యాచరణ పైన కసరత్తు చేస్తోంది. కొందరు సినీ ప్రముఖులు ఇప్పుడు పార్టీ నాయకత్వంతో టచ్ లోకి వచ్చినట్లు చెబుతున్నారు. ఇలా ప్రతీ వర్గాన్ని తమ వైపు తిప్పుకొనేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తాయో చూడాలి.



## గవర్నర్ గ్రీన్ సిగ్నల్!

తెలంగాణ ప్రభుత్వంలో టీఎస్ఆర్టీసీ విలీనంపై గవర్నర్ తమిళిసై నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది!. ఆర్టీసీ బిల్లుపై కేసీఆర్ సర్కార్ ఇచ్చిన వివరణ పట్ల గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టేందుకు గవర్నర్ అనుమతి తెలపనున్నారు.! శనివారం సాయంత్రం కల్లా పుదుచ్చేరి నుంచి హైదరాబాద్‌కు గవర్నర్ రానున్నారు. ఇవాళ రాత్రిలోగా ఆర్టీసీ బిల్లుకు ఆమోదం తెలిపనున్నట్లు తెలియవచ్చింది. ఆర్టీసీ సంస్థ , ఉద్యోగుల ప్రయోజనాల దృష్ట్యా బిల్లుపై న్యాయ నిపుణులతో చర్చించిన అనంతరం తమిళిసై పచ్చజెండా ఊపారని తెలిసింది. ఈ విషయం బయటికి రావడంతో ఆర్టీసీ కార్మికులు ఆనందంలో మునిగితేలుతున్నారు. కాగా.. ఆర్టీసీ విలీనంపై శనివారం నాడు పెద్ద రాద్ధాంతమే జరిగింది. ఆర్టీసీ విలీనానికి కేసీఆర్ క్యాబినెట్ ఆమోదం తెలపడం, గవర్నర్ తమిళిసై ఆమోదం కోసం బిల్లు పంపడం.. ఆర్టీసీ కార్మికులు రాజ్‌భవన్‌ను ముట్టడించడం.. విధివిధానాలపై ప్రభుత్వానికి 5 ప్రశ్నలు సంధించడం, ప్రభుత్వం నుంచి రిప్లయ్ రావడం.. ఈ మధ్యలోనే ఆర్టీసీ సంఘాల నేతలతో వీడియో కాన్ఫరెన్స్‌లో తమిళిసై మాట్లాడటం ఇవనన్నీ చకచకా జరిగిపోయాయి.




## టార్గెట్ ఫిక్స్ చేసిన కమలనాథులు

### ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు సీట్లలో ప్రత్యేక ప్రణాళికలు అమలు

### తెలంగాణ ముఖ్య నేతలంతా అసెంబ్లీకే! ఎంపీలు కూడా వెంటనే సన్నద్ధం కావాలని రాష్ట్ర నేతలకు సూచన ఇకపై చేరికల వేగం మరింత పెంచాలని ఆదేశాలు

హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో బీజేపీ తన వ్యూహాలకు పదునుపెడుతోంది. దక్షిణాదిలో పార్టీ విస్తరణ, తెలంగాణలో అధికార సాధన లక్ష్యంగా కార్యాచరణకు తుదిరూపునిస్తోంది. లోక్‌సభ ఎన్నికల కంటే ముందే శాసనసభ ఎన్నికలు జరగనుండటంతో.. రాష్ట్ర పార్టీకి చెందిన ముఖ్యనేతలంతా (ఎంపీలు సహా) తమకు పట్టున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధం కావాలని బీజేపీ అగ్రనాయకత్వం ఆదేశించినట్టు తెలిసింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఆలోచన ఉన్నా.. రెండు రోజులుగా ఢిల్లీలో పార్టీ ముఖ్యనేతలతో రాష్ట్ర నాయకుల సమావేశాల సందర్భంగా స్పష్టత వచ్చినట్టు సమాచారం. దక్షిణాది రాష్ట్రాల ఎంపీలతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా భేటీ అయినప్పుడు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ నాయకత్వం సన్నద్ధమవుతున్న తీరుపై ఆరా తీసినట్టు తెలిసింది. 2019 ఎన్నికలతో పోల్చితే దక్షిణాది నుంచి ఎక్కువగా ఎంపీ సీట్లు గెలిచేందుకు అవసరమైన వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని మోదీ సూచించినట్టు బీజేపీ వర్గాలు చెప్పా యి. ఈ క్రమంలో పార్టీ విస్తరణకు తెలంగాణ అనుకూలంగా ఉందని పేర్కొన్నారని అంటున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమవడంలో భాగంగా చేరికల వేగం పెంచాలని.. అన్ని అసెంబ్లీ స్థానాల్లో క్షేత్రస్థాయి నుంచి వివిధరూపాల్లో కార్యక్రమాల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారని వెల్లడించాయి. ప్రధానంగా రాష్ట్రంలోని 19 ఎస్సీ, 12 ఎస్టీ రిజర్వుడ్ సీట్లలో పార్టీ బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయాలని.. ఆయా చోట్ల తప్పనిసరిగా బహిరంగ సభలు నిర్వహించాలని, వాటిలో ముఖ్యనేతలు పాల్గొనేలా చూడాలని సూచించారని తెలిపాయి.

**బీఆర్ఎస్ వైఫల్యాలను నిలదీసేలా..** రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలపై అంశాల వారీగా ఆందోళనలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. స్థానికంగా నిరసన కార్యక్రమాలు చే పట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది. డబుల్ బె డ్రూం ఇళ్లు, దళితబంధు వంటి ప్రధాన అంశాలపై బీఆర్ఎస్‌ను ఇరకాటంలో పెట్టేలా కార్యాచరణను రూపొందిస్తోంది.

మరో నాలుగు నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఎన్నికల వ్యూహాల అమలుకు జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నా యి.

ఈ క్రమంలోనే అన్ని అసెంబ్లి నియోజకవర్గాల్లో సభలు, ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాలను పూర్తి చేయాలని నిర్ణయించారు.

**నియోజకవర్గాల్లో ఇతర రాష్ట్రాల బీజేపీ ఎమ్మెల్యేల పర్యటన** : ఈ నెల 20వ తేదీ నుంచి రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన 119 మంది బీజేపీ ఎమ్మెల్యేలు వారం పాటు పర్యటించనున్నారు. వారంతా ఏడు రోజులు తమకు కేటాయించిన నియోజకవర్గంలోనే ఉంటారు. పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్లలో బసచేసి.. ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితులను పరిశీలించనున్నారు. అనంతరం ఆయా అసెంబ్లీ సీట్లలో పార్టీ పరిస్థితి, ప్రధాన పార్టీల బలాబలాలు, పోటీచేసే అభ్యర్థులు, వివిధ సామాజికవర్గాలు, స్థానిక పరిస్థితులపై జాతీయ నాయకత్వానికి నివేదికలు సమర్పించనున్నారు.

# సంపాదకీయం

## నో సంక్షేమం... నో పథకాలూ...?

దేశంలోనూ రాష్ట్రంలోనూ అతి పెద్ద చర్చ ఒకటి ఇపుడు సాగుతోంది. పొరుగున ఉన్న శ్రీలంక దేశం ఆర్థికంగా పతనమవుతునంద నేపథ్యం ఒక వైపు ఉంది. దాంతో మన దేశంలో కూడా ఏం జరుగుతుంది అన్న ఆందోళన ఉత్కంఠ అంతటా ఉంది. దానికి కారణం చాలా చోట్ల ఆర్థిక క్రమశిక్షణ కట్టుతప్పడం. రాజకీయమే పరమావధి కావడం. వారూ వీరూ ఆ పార్టీ ఈ పార్టీ అన్న తేడా లేకుండా అందరూ తాయిలాలను జనాలకు అలవాటు చేశారు. వీటి వల్లనే తాము గెలిచామని వారు భావిస్తున్నారు. మరింతగా వాటిని పెంచి జనాలకు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాలు అప్పుల పాలు అయినా పట్టడంలేదు. రీసెంట్ గా ఉత్తరాదిన జరిగిన ఎన్నికల్లో పంజాబ్ లో ప్రతీ కుటుంబానికి మూడు వందల యూనిట్ల దాకా విద్యుత్ ఫ్రీ అని ఆప్ లాంటి పార్టీ భారీ హామీని ఇచ్చింది. అలాగే ప్రతీ ఫ్యామిలీకి వేయి రూపాయలను నగదు బదిలీ పథకం కింద ఇచ్చింది. దానికి ఖజానా మీద పడే అదనపు బరువు అక్షరాలా ఇరవై వేల కోట్ల రూపాయలు అని చెబుతున్నారు. ఇక బీజేపీ పాలిత రాష్ట్రం యూపీలో అయితే ఈ రోజుకు వేయి రూపాయలు ఉన్న వంట గ్యాస్ ని ప్రతీ ఇంటికీ ఫ్రీగా ఇస్తామని చెప్పి మళ్లీ గెలిచింది. మిగిలిన రాష్ట్రాలూ అదే బాటన పయనిస్తున్నాయి. ఏపీలో చూస్తే సంక్షేమ రథాన్ని పరుగులు తీయిస్తోంది. ఇప్పటికి మూడేళ్ళుగా జగన్ ఈ మహా యాగాన్ని అలా నడిపిస్తున్నారు. ఆయన మరో రెండేళ్ల పాటు ఇదే తీరున సంక్షేమాన్ని కొనసాగించాల్సి ఉంది. దాని వల్ల అభివృద్ధి ఆగిపోయింది అన్నది తెలిసిందే. విపక్షాలు సంక్షేమం అన్న మాటను పక్కన పెట్టి ఏపీలో అభివృద్ధి లేదు అని విమర్శలు చేస్తున్నాయి. ఏపీ ఆర్థికంగా పతనం అయిందని మరో శ్రీలంక అని ప్రచారం చేస్తున్నాయి. దానికి కారణం సంక్షేమ పథకాలు విచ్చలవిడిగా అమలు చేయడం అని మాత్రం చెప్పలేకపోతున్నాయి. అవినీతి అంటున్నాయి లూటీ అంటున్నాయి. సరే అవన్నీ రాజకీయ పడిగట్టు మాటలుగా చూసుకున్నా వచ్చే ఎన్నికలో విపక్షాల ఎన్నికల మ్యానిఫేస్టో ఎలా ఉండబోతోంది అన్నది ఒక పెద్ద చర్చ. ముఖ్యంగా టీడీపీ విషయం తీసుకుంటే 2009 ఎన్నికల్లోనే భారీ హామీలు ఇచ్చింది. ఆల్ ఫ్రీ బాబు అని వైఎస్సార్ కూడా నాడు సెటైర్లు వేసేవారు. ఇక లక్ష కోట్ల దాకా రైతులకు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని భారీ హామీ ఇవ్వడం వల్లనే టీడీపీ 2014లో అధికారంలోకి వచ్చింది అన్న మాట కూడా ఉంది. ఇక 2019 ఎన్నికల ముందర సామాజిక పించన్లు రెండువేలు చంద్రబాబు చేస్తే దాన్ని మూడు వేలకు పెంచుకుపోతామని జగన్ చెప్పి అధికారంలోకి వచ్చారు. ఇక వైసీపీ తీసుకువచ్చిన అమ్మ ఒడి వాలంటీర్ల వ్యవస్థ సచివాలయ వ్యవస్థ సహా వివిధ దీవెనల పథకాల మీద విపక్షాల స్టాండ్ ఏంటి అన్నది కూడా ఇపుడు చర్చకు వస్తోంది. ఏపీ నిజంగా ఏ ఒక్క హామీని ఈ రోజుకు తట్టుకునే స్థితిలో లేదు. ఎక్కడ లేని అప్పులు తెచ్చి మరీ నగదు బదిలీ పథకాలు అమలు చేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఏపీలో సంక్షేమ పథకాలను తాము కొనసాగించమని అభివృద్ధి మా అజెండా అని టీడీపీ సహా ఏ పార్టీ అయినా డేరింగ్ గా జనాల్లోకి వచ్చి చెప్పగలదా అన్నదే ఇక్కడ ప్రశ్న. ఒకవేళ అలా చేస్తే కనుక జనాలు ఎలా రియాక్ట్ అవుతారు అన్నది కూడా చూడాలి. రాష్ట్రం సమాజం ఏమైపోతేనేమి మాకు తాయిలాలు దక్కాయి కదా అదే చాలు పదివేలు అనుకునే వ్యవస్థలో ఉన్నారంతా. దాంతో నో సంక్షేమం నో పథకాలు అంటే ఓట్ల పంట పండుతుందా రాజధాని కడతాం మహా నగరాలను నిర్మిస్తామని అభివృద్ధి అజెండా పెట్టుకుని వెళ్తే జనాల రియాక్షన్ ఎలా ఉంటుంది. అయితే రాజకీయ పార్టీల వరకూ చూస్తే సంక్షేమ పథకాలను కొనసాగించమని చెప్పే పరిస్థితి 2024 ఎన్నికల్లోనూ కనిపించదని అంటున్నారు. తాము అంతకంటే మెరుగ్గా మరిన్ని కొత్త పథకాలను కూడా తెచ్చి ఇస్తామనే చెబుతాయి. మరి అలాంటి హామీని ఇవ్వకుండా ఏపీ పతనం అవుతోందని చెప్పడం విమర్శలు చేయడం వల్ల ఉపయోగం ఉందా అన్నది కూడా చర్చగానే చూడాలి. ఏపీని పునర్ నిర్మిస్తామని టీడీపీ అంటోంది. దానికి ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం. అలా చేయాలీ అంటే పందేరాలు అన్నీ బంద్ చేయాలి. అలా కొన్నేళ్ల పాటు చేస్తేనే తప్ప ఏపీ బాగుపడదు ఇది ఆర్థిక నిపుణులు చెబుతున్న మాట. మరి దీన్ని జనాల్లో ఉంచి వారిని ఒప్పించి సానుకూల ఓటుతో అధికారంలోకి వచ్చిన పార్టీదే అసలైన విజయం. మరి అలా చేయాలంటే 2024లో రాజకీయాలు చేసే నాయకత్వానికి బదులుగా రాజనీతితో నడిచే నాయకత్వం రావాలి. అది ప్రస్తుత పరిస్థితుల్లో ఆశించగలమా. చూడాలి మరి.

# అంతా బాగుండాలి.. రైతు మురవాలి



వరంగల్ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. జిల్లాల వారీగా ఏర్పాటు చేయాల్సిన కొనుగోలు కేంద్రాల సంఖ్యను పౌరసరఫరాల శాఖ అధికారులు ఖరారు చేశారు. ఇప్పుడిప్పుడే రైతన్నలు వరి కోతలు మొదలుపెట్టారు. గత అనుభవాల దృష్ట్యా అధికారులు ముందుగానే కొనుగోలు కేంద్రాల వద్ద తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. గన్నీ సంచుల మొదలుకొంటే మంచి నీటి సౌకర్యం వరకు ఉంటే అన్నదాతలు ఇబ్బంది లేకుండా ధాన్యం విక్రయిస్తారు.

**టార్పాలిన్లు అవసరం**

రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యం వెంటనే కాంటా కాదు. తేమ శాతం ఎక్కువ ఉంటే రెండు, మూడు రోజులు కేంద్రం వద్దే ఆరబోయాల్సి ఉంటుంది. ధాన్యంపై కప్పేందుకు కేంద్రాల నిర్వాహకులే టార్పాలిన్ కవర్లు అందించాలి. గతేడాది అనేక చోట్ల వీటిని ఇవ్వకపోవడంతో రైతన్నలే తెచ్చుకున్నారు. కొన్ని చోట్ల అకాల వర్షాలు కురిసి ధాన్యం దెబ్బతింది. ధర్మసాగర్ మండలంలో అనేక చోట్ల టార్పాలిన్లు ఇవ్వలేదు. ఈ సారి సరిపడా అందుబాటులో ఉంచాలి. గన్నీ తిప్పలుగన్నీ సంచుల కొరత వల్ల గతంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చిల్లులు పడ్డవి, అనేకమార్లు వినియోగించిన నాసిరకం సంచులను నిర్వాహకులు ఇవ్వడంతో అవి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లిలో చిరిగిన గన్నీ సంచులు అందించడంతో వారం రోజులపాటు కొనుగోళ్లు నిలిచాయి. ఈసారి అలా కాకుండా కొత్త గన్నీలను ముందుగానే సరఫరా చేయాలి.

**తూకంలో తకరారు**

ఖరీఫ్ కొనుగోళ్లు, గత యాసంగి ధాన్యం కొనుగోళ్లలో అనేక కేంద్రాల్లో కాంటాల సమయంలో నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెట్టారు. తాలు పేరుతో 50 కేజీలకు ఒకటి రెండు కేజీల తరుగును తీసేసి కాంటాలు వేశారు. దీంతో అన్నదాతలు చాలా మోసపోయారు. ఈ సారి తరుగు విషయంలో అధికారులు పక్కా మార్గదర్శకాలు పాటించి రైతులు నష్టపోకుండా చూడాలి.

తాగునీరు..ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. కేంద్రాల వద్ద రైతుల కోసం తాగునీటి సౌకర్యం కల్పించాలి. లేదంటే గొంతెండి దాహార్తితో తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. గతంలో చాలా కేంద్రాల్లో మంచినీటి సౌకర్యం లేక రైతులే సొంతంగా నీరు తెచ్చుకున్నారు. ఈ సారి అన్ని కేంద్రాల వద్ద చల్లటి నీటి వసతి కల్పించాలని కర్షకులు కోరుతున్నారు.

**రవాణాలో ఇక్కట్లు**

కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించే విషయంలోనూ కర్షకులు గతంలో అనేక పాట్లు పడ్డారు. లారీల కొరత ఉండడంతో కాంటాలు పూర్తయినా రోజుల తరబడి కేంద్రాల వద్ద నిల్వ ఉండడం వల్ల అకాల వర్షాలు కురిసి రైతులు తీవ్ర నష్టపోయారు. దీంతో చాలా చోట్ల రైతులే సొంతంగా ట్రాక్టర్లను ఏర్పాటుచేసుకొన్నారు. బస్తాకు రూ.50 చొప్పున రవాణా ఛార్జీలు భరించడంతో ఆర్థికంగా భారమైంది. లి గతేడాది వరంగల్ జిల్లా నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపూర్ మండలాల్లోని పలు కేంద్రాల్లో రైతులు రవాణా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సారి లారీలు సరిపడా లేకపోతే అధికారులే ట్రాక్టర్లను ఏర్పాటుచేసి రవాణా భారాన్ని రైతులపై పడకుండా చూడాలి. 11 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా..యాసంగి ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని ఇప్పటికే అధికారులు అంచనా వేశారు. ఆరు జిల్లాల్లో కలిపి 11.73 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. గరిష్ఠంగా వరంగల్ జిల్లాలో 2.93 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుంది. ధాన్యాగారంగా పేరున్న ఈ జిల్లాలో 1,12,578 ఎకరాల్లో వరి సాగైనట్టు అంచనా. ఉమ్మడి జిల్లా మొత్తం కలిపి 5 లక్షల ఎకరాల వరకు సాగైంది.

**ఇబ్బందులు పడ్డాం- రావుల రామ్మోహన్‌రెడ్డి, వెల్దండ, జనగామ జిల్లా**

గతేడాది ధాన్యం కొనుగోళ్లలో అనేక ఇక్కట్లు ఎదుర్కొన్నాం. టార్పాలిన్లు లేక, గన్నీల కొరత, రవాణాకు లారీల్లేక సొంత వాహనాలు పెట్టుకున్నాం. మిల్లును జనగామ జిల్లాలో కాకుండా హనుమకొండ మడికొండ వద్ద కేటాయించారు. ఈసారి అధికారులు దృష్టి పెట్టి సమస్యలు లేకుండా చూడాలి.

**తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పా- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

ప్రతి గింజా కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అన్ని కేంద్రాల్లో మంచి నీటి వసతి నుంచి సకల ఏర్పాట్లు చేయాలని సమీక్షలో ఆదేశించాను. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తా.

**జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు**

ములుగు 180
వరంగల్ 191
హనుమకొండ 164
జనగామ 200
భూపాలపల్లి 210
మహబూబాబాద్ 234

# ప్రయాస ప్రాంగణాలు..!



వరంగల్ : ఆర్టీసీ బస్టాండుల్లో సమస్యలు తిష్టవేస్తున్నాయి. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. మండు వేసవిలో చల్లని తాగునీరు అందుబాటులో లేక ప్రయాణికుల గొంతులు ఎండిపోతున్నాయి. పంకాలు తిరగడం లేదు. పరిసరాల్లో శుభ్రత కానరావడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ బస్‌స్టేషన్లలో నెలకొన్న సమస్యలపై పరిశీలించింది.

**సమస్యలు అనేకం..**

వరంగల్ నుంచి హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సూర్యాపేట, మహబూబాబాద్ తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులతో పాటు లోకల్ ప్రాంతాలకు మొత్తం 650 బస్సులు నిత్యం వేలాది మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తుంటాయి. ఇంత పెద్ద బస్టాండులో రెండేళ్లుగా పంకాలు తిరగడం లేదు. కూర్చోవడానికి బెంచీలు కూడా లేకపోవడంతో.. వృద్ధులు, మహిళలు, చిన్నారులు అవస్థలు పడుతున్నారు. 25ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండు శిథిలావస్థకు చేరి అక్కడక్కడా పెచ్చులూడింది. ప్రమాదం ప్రయాణికుల చెంతనే పొంచి ఉంది. ప్రాంగణంలోని మూత్రశాలలు అపరిశుభ్రంగా ఉండడంతో.. ప్రయాణికులు దుర్వాసన భరించలేకపోతున్నారు. రాత్రి సమయంలో దీపాలు వెలుగకపోవడంతో రాత్రిపూట దొంగలు రెచ్చిపోతున్నారు. సుమారు 20 నుంచి 30 వేల మంది ప్రయాణించే బస్టాండులో ఒక్క సెక్యూరిటీ సిబ్బంది అందుబాటులో లేకపోవడం గమనార్హం.

**అలంకారప్రాయంగా నీటి కుళాయిలు**

నర్సంపేటలో మొత్తం పది ప్లాటుఫారాలుండగా కేవలం ఐదు పంకాలు బిగించారు. అందులో ఒకటి తిరగడం లేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలు మూతపడి ఉన్నాయి. ప్రయాణికుల కోసం ములుగు ప్లాటుఫారం వైపు ఏర్పాటు చేసిన కుళాయిలు అలంకార ప్రాయంగా మారాయి. మాజీ ఎంపీ ఆజ్మీర సీతారాంనాయక్ నిధులు మంజూరు చేయించి రూపాయికి శుద్ధిచేసిన తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంటు మూతపడినా, తిరిగి తెరిపించలేదు.

**నిరుపయోగంగా మరుగుదొడ్లు**

వర్ధన్నపేట పట్టణంలోని ఆర్టీసీ ప్రాంగణం గుంతలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు బస్టాండ్‌లోనికి వచ్చివెళ్లే సమయంలో కుదుపులతో వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాంగణంలోని మరుగుదొడ్ల చుట్టూ చెట్లు పెరిగి నిరుపయోగంగా మారాయి. బస్టాండులో పంకాలు లేవు. ప్రాంగణంలో ప్రైవేటు వాహనాలు నిలుపుతున్నారు. సాయంత్రం ఆరు దాటిన తర్వాత బస్సులు బస్టాండులోనికి రావడంలేదని ప్రయాణికులు చెబుతున్నారు.

**ఒక్క పంకా తిరగడం లేదు..ఒ.దయాకర్, ప్రయాణికుడు**

వరంగల్ బస్టాండులో ఒక్క పంకా తిరగడం లేదు. ఉక్కపోతను తట్టుకోలేకపోతున్నాం. బస్టాండంతా అపరిశుభ్రంగా ఉంది. స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

**మరమ్మతులు పూర్తి చేస్తాం..-సురేశ్, వరంగల్ 2 డిపో మేనేజర్**

వరంగల్ బస్టాండులో మొత్తం 10 ఫ్యాన్లలో నాలుగు పనిచేయడం లేదు. త్వరలోనే వీటికి మరమ్మతులు చేయిస్తాం. ఇతరత్రా సమస్యలను త్వరలో పరిష్కరిస్తాం. బస్టాండులో ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నియమించాం. రాత్రి సమయాల్లో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. బస్టాండులో వెలగని దీపాలను గుర్తించి వాటిస్థానంలో వేరే వాటిని అమర్చుతాం.

# పంట నష్టం లెక్క తేలింది

వరంగల్ : వడగళ్ల వర్షాలతో పంటలు నష్టపోయిన ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులకు ఇదీ శుభవార్త. మార్చిలో కురిసిన ఆకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు పంటలు నష్టపోయిన రైతులకు 40 రోజుల వ్యవధిలోనే పూర్తి స్థాయిలో పరిహారం అందించడం ఇదే మొదటి సారి. మార్చిలో రెండుసార్లు వర్షాలు పంటలకు నష్టం కలిగించాయి. మొదట 17వ తేదీన, రెండోసారి 21వ తేదీన వడగళ్లు పడ్డాయి. మొక్కజొన్న, వరి, మిరప, కూరగాయలు, మామిడి తదితర పంటలకు నష్టం జరిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. పంటలను పరిశీలించారు. రైతులకు భరోసా కల్పించారు. ఎకరానికి రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 74,797 రైతులకు చెందిన 85,670 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇందుకనుగుణంగా ఎకరానికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ. 85,67,34,250 ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను నాలుగైదు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

# సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ సేవలు

గోదావరిఖని : బొగ్గుగని కార్మికుల భవిష్య నిధి వివరాలు ఇక నుంచి ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశం ఏర్పడనుంది. ప్రతీ సంవత్సరం ఎంత నిల్వ అవుతుందన్న వివరాలను ఆన్‌లైన్‌లోనే వివరాలు తెలుసుకునే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తమ నిల్వ వివరాలు తెలుసుకునేందుకు జాబితాలు పంపిణీ చేయాలని కార్మికులు అడిగే పరిస్థితి లేకుండా సీఎంపీఎఫ్ (కోల్ మైన్ ప్రావిడెంట్ ఫండ్) అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఈ ఏడాది మే నాటికి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. బొగ్గుగని కార్మికులకు సంబంధించి ఏటా ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ఆ ఏడాదికి సంబంధించిన నిల్వ ఎంత జమ చేశారన్నది వివరాలతో కూడిన జాబితాను అందిస్తారు. కరోనా కారణగా 2019, 2020లో ఆలస్యంగా పంపిణీ చేశారు. ఆ తర్వాత అందించ లేదు. దీంతో కార్మిక సంఘాల నాయకులు సీఎంపీఎఫ్ నిల్వ జాబితాలను అందించాలని డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ఈ ఏడాదికి సంబంధం




చిన సీఎంపీఎఫ్ నిల్వకు సంబంధించిన చీట్టీలు కూడా అందించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గత ఏడాదితో పాటు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివరాలను సీఎంపీఎఫ్ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

**సీఎంపీఎఫ్ నంబరుతో..**

ప్రతీ కార్మికుడికి సీఎంపీఎఫ్ నంబరు ఉంటుంది. దీని ఆధారంగా ఆన్‌లైన్‌లో తమ నిల్వ నిధిని చూసుకునే అవకాశం ఇక నుంచి అందుబాటులోకి రానుంది. బొగ్గుగని కార్మికులు తమ వాటా కింద కొంత చెల్లిస్తే యాజమాన్యం ంతే మొత్తం కలిపి నిల్వ చేస్తుంది. సీఎంపీఎఫ్ ఖాతాలో జమ చేసిన నిల్వను కార్మికులు చూసుకోవడానికి చర్యలు చేపట్టారు.

**అధికారులతో మాట్లాడాం**

**వై.సత్తయ్య, బీఎంఎస్ నాయకులు**

సీఎంపీఎఫ్ నిల్వ మొత్తం చూసుకోవడానికి అధికారులతో తమ నాయకులు మాట్లాడారు. 23న రాంచిలో సీఎంపీఎఫ్ అధికారులను కలిసి నిల్వ వివరాలకు సంబంధించిన కార్మికులకు పంపిణీ చేసే జాబితాల వివరాలు వెంటనే అందించాలని చర్చించారు. ఇక నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ప్రగతి మెరిసింది.. పల్లె మురిసింది

వీర్నపల్లి : తెలంగాణ ఆవిర్భావం తర్వాత జిల్లాల పునర్విభజనలో రాజన్న సిరిసిల్ల కొత్త జిల్లాగా ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు సంబంధించిన ర్యాంకింగ్‌లో తనదైన ముద్ర వేసుకుని దేశంలోనే అగ్రగామిగా నిలుస్తున్న జిల్లా ఇదే స్ఫూర్తితో దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల సాధనే లక్ష్యంగా పోటీ పడుతుంది. తొమ్మిది అంశాల్లో జిల్లా స్థాయిలో 27 పంచాయతీలు అవార్డులకు ఎంపికయ్యాయి. జిల్లాలో 13 మండలాల పరిధిలో 255 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అయితే 2022 సంవత్సరానికి సంబంధించి కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల పేరిట జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. తొమ్మిది అంశాల్లో నిర్దేశించిన ప్రశ్నలు, అవసరమైన ధ్రువపత్రాలు జత చేసి అధికారులు దరఖాస్తులు సమర్పించారు. మండల స్థాయిలో ఎమ్పీడీవోలు, జిల్లా స్థాయిలో కలెక్టర్, రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ నేతృత్వంలోని కమిటీలు నామినేషన్‌లను పరిశీలిస్తాయి. ఇతర రాష్ట్రాల్లో గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న క్షేత్ర పరిశీలన బృందం పరిశీలించి జాతీయ పంచాయతీ పురస్కారానికి ఎంపిక చేస్తారు. సంబంధిత శాఖ అధికారుల పరిశీలన తర్వాత మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పల్లెలను ప్రశంసా పత్రాలతో సత్కరించనుంది. మండల స్థాయిలో పురోగతి సాధించిన




పల్లెలకు ఈ నెల 24, 25 తేదీల్లో తొమ్మిది అంశాల్లో 27 అవార్డులు పంపిణీ చేసింది. కాగా జిల్లా స్థాయిలో ఆయా అంశాల్లో అవార్డులు దక్కించుకున్న పల్లెలకు నేడు మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు. పంచాయతీల మధ్య స్నేహపూర్వక పోటీతత్వాన్ని పెంచడంతో పాటు 2030 నాటికి సుస్థిర ప్రగతి లక్ష్యాలను వేగవంతం చేయడమే ఈ జాతీయ పురస్కారాల లక్ష్యం. జాతీయ స్థాయిలో సత్తా చాటిన గ్రామాలకు ఏప్రిల్ 24న పంచాయతీరాజ్ దినోత్సవం నాడు పురస్కారాలు అందజేయనున్నారు. జిల్లాకు చెందిన గ్రామాలు జాబితాల్లో ఉండాలని జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు.

గతంలో ఇలా...జిల్లాలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె ప్రగతి కార్యక్రమం సత్ఫలితాలను ఇచ్చింది. అభివృద్ధే లక్ష్యంగా అన్ని పంచాయతీ పాలక వర్గాలు పని చేస్తున్నాయి. దీని ఫలితంగా జిల్లా ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఫోర్ స్టార్ ర్యాంకింగ్‌లో మొదటి స్థానంలో ఉంది. జిల్లాలోని పల్లెలకు గడిచిన ఎనిమిదేళ్లుగా 11 జాతీయ అవార్డులు వరించాయి. 2015లో చందుర్తి, 2016లో బాలమల్లుపల్లి, చందుర్తి, రామన్నపల్లి, 2017లో కస్బెకట్కూర్, గోపాలరావుపల్లి, 2018లో ముష్టిపల్లి, 2021లో మోహినికుంట, హరిదాస్‌నగర్, 2022లో మండెపల్లి, మద్దికుంటలు జాతీయ స్థాయిలో మెరిశాయి. ఈ ఏడాది సైతం జాతీయ స్థాయి అవార్డుల్లో జిల్లాలోని పంచాయతీలు పురస్కారాలు సాధిస్తాయని అధికారులు భావిస్తున్నారు.

# ఆక్రమణలు.. అనర్థాలు

కోరుట్ల : కోరుట్ల పట్టణంలో చెరువు కాలువలు ఆక్రమణకు గురవడంతో ఏటా వర్షాకాలంలో వరదలతో ప్రజలు ఇళ్లను ఖాళీచేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సుమారు ఐదేళ్లుగా భారీ వర్షాలు కురవడంతో మద్దుల చెరువు మత్తడిదూకి నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో వరదలు రోడ్లను, కాలనీలను ముంచెత్తుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షం వల్ల రోడ్లపై 5 అడుగుల మేర వరద నీరు పారింది. సుమారు 150 ఇళ్లలో వరద నీరు చేరడంతో ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఫర్నీచర్, నిత్యావసర సరకులు, ఎలక్ట్రికల్ పరికరాలు, ద్విచక్ర వాహనాలు, కార్లు దెబ్బతిన్నాయి. పలు ఇళ్ల ప్రహరీలు కూలిపోయాయి. సిమెంట్‌రోడ్లు, మట్టిరోడ్లు భారీగా కోతకు గురయ్యాయి.

అయిలాపూర్‌రోడ్‌లోని మద్దుల చెరువు(మినీ ట్యాంక్‌బండ్) మత్తడి కింద సుమారు 10-16 అడుగుల వెడల్పుతో కాలువలు ఉండేవి. ఈకాలువ లోతట్టు ప్రాంతాలైన అయిలాపూర్‌రోడ్, ప్రకాశంరోడ్ మీదుగా బొల్లికుంట, కల్లూర్‌రోడ్ నుంచి ఫుల్‌వాగులో కలుస్తుండేది. 16 ఏళ్ల కిందట కాలువ ఇరువైపులా భూములున్న వారు రియల్



ఎస్టేట్ వ్యాపారులకు భూములను విక్రయించారు. దీంతో రియల్ వ్యాపారులు ఆ స్థలాల్లో అక్రమ లేఅవుట్లను ఏర్పాటు చేస్లి ప్లాట్లుగా విభజించి విక్రయాలు చేపట్టారు. కాలువ 3 అడుగులకు కుంచించుకుపోవడంతో వంకలుగా మార్చారు. ఆక్రమించిన కాలువను అప్పటి ప్రజాప్రతినిధుల, నాయకుల అండతో మురుగు కాలువలు, సిమెంట్ రోడ్లుగా నిర్మించారు. 30 అడుగుల విస్తీర్ణంతో రోడ్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా కేవలం 18 అడుగుల వెడల్పుతో రోడ్లను ఏర్పాటు చేశారు.

మత్తడి కాలువ రహదారిగా..

రవీంద్రరోడ్‌లోని తాళ్ల చెరువులో నీరు పూర్తిగా నిండిన తర్వాత మత్తడిదూకి వరద నీరు బయటకు వెళ్లేందుకు 10-14 అడుగుల మేర కాలువ ఉండేది. ఈ కాలువ ద్వారా వరద నీరు ప్రవహించి ఫుల్‌వాగులో కలుస్తుండేది. సుమారు 17 ఏళ్ల కిందట మత్తడి కిందున్న కాలువను పూర్తిగా పూడ్చివేసి సిమెంట్‌రోడ్‌గా మార్చారు. పలుచోట్ల కాలువను ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మత్తడి కిందున్న కాలువ ఆనవాళ్లు లేకుండా పోయాయి. మత్తడి దూకిన నీరు సిమెంట్‌రోడ్‌పై 2 అడుగుల మేర ఉద్ధృతంగా ప్రవహించడంతో చాలాకాలనీలు జలమయమవుతున్నాయి. రోడ్లపై రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి.

కానరాని శాశ్వత పరిష్కారం

మద్దుల చెరువు, తాళ్ల చెరవు మత్తడి కాలువలను ఆక్రమించి చిన్న మురుగు కాలువలు, రోడ్లను నిర్మించడంతో ఏటా వర్షాకాలంలో వరదలు పోటెత్తి ఇళ్లను ముంచెత్తుతున్నాయి. ఏటా వరదలు తగ్గుముఖం పట్టిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి వరద ప్రాంతాలను సందర్శించి బాధిత ప్రజల పట్ల సానుభూతి ప్రదర్శించి వెళ్తున్నారే తప్ప పరిష్కారం చూపడం లేదని లోతట్టు ప్రాతాల ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్దుల చెరువు, తాళ్ల చెరువు మత్తడి కాలువను రోడ్ల కింది నుంచి అంతర్గత కాలువలను నిర్మిస్తే వరద నీటికి కొద్దిమేర పరిష్కారం చూపగలుగుతారు. లేదంటే రానున్న రోజుల్లో చెరువుల పైభాగంలో పట్టణం విస్తరించి భవనాలు నిర్మించడంతో మరింతగా వరదలు వచ్చే అవకాశాలున్నాయి. చెరువు కింది ప్రాంతంలోని ప్రకాశంరోడ్, ఝాన్సిరోడ్, కల్లూర్‌రోడ్, ఆదర్శనగర్, రవీంద్రరోడ్, ఇతర కాలనీలో వరదలు మరింతగా పెరిగే ప్రమాదాలున్నాయని ప్రజలు వాపోతున్నారు.

# ఆషాఢం.. రాజన్నకు తగ్గిన ఆదాయం

వేములవాడ : దక్షిణకాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఆషాఢంలో భక్తుల రాక తగ్గి ఆలయ ఆదాయంపై ప్రభావం పడింది. ఆషాఢం కావడంతో భక్తులు పూజలు జరిపించుకునేందుకు చాలా వరకు ఆసక్తి చూపరు. దీంతో తాకిడి తగ్గింది. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన సోమవారం రోజు సైతం భక్తులు నామమాత్రంగానే దర్శించుకున్నారు. ఈ ఏడాది అధిక శ్రావణం రావడంతో ఆగస్టు 16 వరకు కొనసాగనుంది. ఆగస్టు 17 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కావడంతో తిరిగి స్వామివారి దర్శనానికి భక్తుల రద్దీ అప్పటి నుంచి పెరగనుంది.

అంతంత మాత్రంగానే భక్తులు

సాధారణంగా ఇతర రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకొంటారు. ఆషాఢం ప్రారంభమైనప్పటి నుంచి తగ్గిపోయారు.



సోమవారం సైతం భక్తులు లేక ఆలయ పరిసరాలు వెలవెలబోయాయి. క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలు, ప్రసాదాల విక్రయ కేంద్రాలు బోసిపోయాయి. ప్రసాద విక్రయాలు తగ్గాయి. కోడె మొక్కులు, ఇతరత్రా పూజల ద్వారా వచ్చే ఆదాయం పడిపోయింది. రూ. కోట్లల్లో వచ్చే ఆదాయం రూ.లక్షల్లో సమకూరింది. ఎప్పుడూ తిరిగే కోడెలకు విశ్రాంతి దొరికింది. భక్తుల రాక తగ్గి ఆలయ ఆదాయంపై ప్రభావం చూపింది.

రెండు నెలలు ప్రభావం

ప్రతాప నవీన్, ఏఈవో రాజన్న ఆలయం

ఆషాఢ మాసంలో భక్తులు రాకపోవడంతో ఆలయ ఆదాయంపై ప్రభావం పడింది. మిగతా రోజుల్లో ఎక్కువ మంది స్వామివారిని దర్శించుకునేందుకు వస్తుంటారు. ఈసారి అధిక శ్రావణ మాసం కూడా రావడంతో రెండు నెలలు అంతంత మాత్రంగానే వస్తుంటారు. గతంలో కంటే ఆదాయం తగ్గుతుంది.

# కన్నీటి ధారలకు పట్టాలే సాక్ష్యం!



జనగామ : రైలు పట్టాలపై పడి ఉండే గుర్తు తెలియని మృతదేహాల దృశ్యాలు హృదయాలను కలిచివేస్తాయి. ఎక్కడి నుంచో ప్రయాణం చేస్తూ వస్తుంటారు.. తన కోసం ఎదురుచూసేవారిని కలుసుకోవడానికి గమ్యస్థానం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తుంటారు.. చివరికి జారిపడడమో.. ఇతర కారణాల చేతనో రైలు పట్టాలపై అనాథ శవాలుగా మిగిలిపోతుంటారు. ఇలాంటి సంఘటనలు ఇటీవల కాజీపేట జీఆర్‌పీ పరిధిలో ఎక్కువగా జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

రైలు పట్టాలపై పడి ఉండే అనాథ శవాలను రెండు రోజులు చూసి మూడో రోజు దహనం (కాల్చడం) చేస్తారు జీఆర్‌పీ పోలీసులు. తర్వాత వారి బంధువులు వచ్చి అడిగితే ఫొటోల ఆధారంగా గుర్తిస్తారు. గతంలో మృతదేహాలను ఖననం చేసేవారు. ఈ విధానంలో అవసరమైతే తర్వాత వెలికితీసి రీపోస్టుమార్టం చేయడానికి వీలు ఉండేది. కొన్నిసార్లు సంబంధికులు తమవారి మృతదేహాలను తవ్వి తీసుకుని ఇంటికి తీసుకెళ్లి దహన సంస్కారాలు చేసుకునేవారు. ఇప్పుడు జీడబ్ల్యూఎంసీ పరిధిలో అనాథ శవాలను పూడ్చి పెట్టడానికి స్థలం లేకపోవడం వల్ల దహనం చేస్తున్నారు. ఈ ప్రక్రియలో జీఆర్‌పీ పోలీసులు కాలర్‌బోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి అక్కడ భద్రపరుస్తున్నారు. సంబంధిత నివేదికను స్టేషన్‌లో అందుబాటులో ఉంచుతున్నారు.

ఎక్కడి నుంచి వస్తున్నారో..

దూర ప్రాంతాలకు వెళ్లే రైలులో నుంచి పడి మరణించిన వారిలోనే గుర్తుతెలియని శవాలు ఎక్కువగా ఉంటాయి. వేగంగా ప్రయాణం చేస్తున్న రైలులో నుంచి పడినప్పుడు వారి ఒంటిమీద ఉన్న దుస్తులు మొత్తం గుర్తుపట్టకుండా అవుతాయి. కొన్నిసార్లు శరీర భాగాలు మాత్రమే లభిస్తాయి. తల లభించని సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలా మరణించిన వారి బంధువుల్లో ఎక్కువగా నిరక్షరాస్యులు ఉంటారు. కొందరు ఏ రైలులో ప్రయాణం చేశారో తెలియక కూడా గుర్తించకుండా ఉంటారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు అన్ని పోలీసు స్టేషన్లకు వాకబు చేయడం కష్టం అవుతుంది. కొందరు అవగాహన లోపంతో మరణించిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి మిన్నకుంటారు.

హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి హసన్‌పర్తి రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలునుంచి జారిపడి మరణించారు. మృతదేహం గుర్తుపట్టని విధంగా ఉండటంతో మార్చురీలో 72 గంటలు ఉంచి దహనం చేశారు. తర్వాత ఆయన భార్య కాజీపేట జీఆర్‌పీ పోలీసు స్టేషన్‌కు వచ్చి తన భర్త మృతదేహం కావాలని కోరింది. ఆనవాళ్లు చెప్పడంతో దాని ఆధారంగా కుటుంబసభ్యుల డీఎన్‌ఏ పరీక్ష చేయించి.. తమ వద్ద ఉన్న కాలర్‌బోన్ డీఎన్‌ఏతో సరిపోల్చి మరణ ధ్రువీకరణ పత్రం అందించారు. అనంతరం ఆమె కుమారుడికి తండ్రి ఉద్యోగం వచ్చింది.

ఇటీవల గుర్తుతెలియని 55 ఏళ్ల వయస్సు గల వ్యక్తి పెద్దపెండ్యాల సమీపంలో రైలు నుంచి జారిపడి మరణించారు. ఆయన వద్ద తమిళ వార్త పత్రిక ముక్క మాత్రమే దొరికింది. ఎలాంటి ఆధారాలు లేవు. దీంతో జీఆర్‌పీ పోలీసులు మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి అక్కడ 72 గంటల తర్వాత అనాథ శవంగా పంచనామా నిర్వహించి ఖననం చేశారు. ఇప్పటి వరకు సంబంధికులు ఎవరూ రాలేదు.

ఆధారాలు భద్రపరుస్తారు..గుర్తుతెలియని శవాలను ఎంజీఎం మార్చురికి పంపే ముందు వారి మీద ఉన్న ఆధారాలను పోలీసులు భద్రపరుస్తారు. ముఖ్యంగా పుట్టుమచ్చలు, అంగవైకల్యం, ఇతర దెబ్బలకు సంబంధించిన మరకలు, ఎత్తు, రంగు, జుట్టు రంగు ఆ తర్వాత దుస్తులను తీసుకుంటారు. ఇందులో షర్టు కాలర్ మీద ఉన్న టైలర్ చిరునామాను బట్టి ఎక్కడివారో గుర్తిస్తారు. చరవాణి, పర్సులోని గుర్తింపు కార్డులు, చరవాణిలో వారు ఫోన్ చేసిన వివరాలు సేకరిస్తారు.

హత్యా.. ఆత్మహత్యా?

కొన్నిసార్లు రైలు నుంచి పడిన వ్యక్తి ఎలా మరణించాడని చెప్పడం కష్టంగా ఉంటుంది. పోలీసులు ప్రాథమికంగా రైలు డ్రైవర్ కంటి సాక్ష్యాన్ని తీసుకుంటారు. రైలు కిందపడిన వ్యక్తి.. ప్రమాదవశాత్తు మరణించాడా లేదా ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయాన్ని సంఘటన జరిగిన తర్వాత వచ్చే స్టేషన్‌లో డ్రైవరు నమోదు చేస్తారు. రైలు నుంచి జారిపడిన విషయాన్ని మాత్రం గమనిస్తేనే చెబుతారు. కొన్ని సార్లు గార్డులు గుర్తిస్తారు. ఇలా ఎవరూ చూడకుంటే సంఘటనను బట్టి పోలీసులు కారణాన్ని నమోదు చేసుకుంటారు.

గతంలో కాజీపేట జీఆర్‌పీ పరిధిలోని మంచిర్యాలలో ఒక వ్యక్తి రైలు కిందపడి మరణించారు. ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మరణించనట్లు కేసు నమోదైంది. గుర్తుతెలియని శవంగా గుర్తించి పోలీసులు బంధువులకు అప్పగించకుండానే నిబంధనల ప్రకారం ఖననం చేశారు. మూడు నెలల తర్వాత మరణించిన వ్యక్తి మిత్రబృందంలో స్నేహితుడు తాగిన మైకంలో తామే రైలు నుంచి తోసివేసినట్లు నోరు జారడంతో భార్య మరల కేసును తిరగతోడారు. దీంతో మరల ఖననం చేసిన మృతదేహాన్ని తీసి పోస్టుమార్టం చేసి హత్యానేరంగా కేసు నమోదు చేశారు.

తరలించడం కష్టం..ఏటా అనాథ శవాలపై ఇటు జీఆర్‌పీ అటు ఆర్పీఎఫ్ ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రైలు పట్టాల మీద లభించిన శవాన్ని అక్కడ నుంచి తరలించడం కష్టంగా మారుతుంది. దారి, రవాణా సౌకర్యం లేని చోట మరీ ఇబ్బందిగా ఉంటుంది. కొన్ని సార్లు పోలీసులు.. మరికొందరి సహకారంతో కిలోమీటర్లు శవాన్ని మోసుకుని వచ్చిన సందర్భాలు ఉన్నాయి. రాత్రిపూట సంఘటన జరిగితే ఒక కానిస్టేబుల్ అక్కడ కాపలా ఉండాలి. రైలుకిందపడిన వ్యక్తి కొన్ని సార్లు గాయాలతో రైలు పట్టాల పక్కన పడి ఉంటారు. ఈ విషయాన్ని వెనకాల వచ్చిన రైలు డ్రైవర్లు రైల్వే అధికారులకు తెలియజేస్తారు. ఈ సమాచారం అందుకున్న రైల్వే పోలీసు రాత్రైనా సంఘటనా స్థలానికి వెళ్లి అతన్ని ఆసుపత్రికి తరలిస్తారు.. ఇక గుర్తుపట్టని శవాల వివరాలను సంవత్సరాల కొద్ది భద్రపరచాల్సి వస్తుంది. మహబూబాబాద్ సమీపంలోని తాళ్ల పూసల పల్లి వద్ద జరిగిన గౌతమీ ఎక్స్‌ప్రెస్ రైలు అగ్నిప్రమాద సమయంలో రెండు అనాథ శవాల బూడిదను ఇప్పటికీ భద్రపరిచారు..

గోల్కొండ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటనలో కూడా రెండు అనాథ శవాలను ఇప్పటి వరకు గుర్తించలేకపోయారు.

సున్నితమైన అంశం:

రైలు కిందపడి మరణించిన సంఘటనలు చాలా సున్నితంగా ఉంటాయి. సంఘటన స్థలాన్ని బట్టి హత్యా, ఆత్మహత్యా అని నిర్ధారిస్తాం. 72 గంటల తర్వాత దహనం చేశాక బంధువులు వచ్చి ఏడుస్తారు. వారికి సమాధానం చెప్పలేకపోతాం. అయినా మా విధుల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూస్తాం. రైలు ప్రయాణ టికెట్టు ఉండి ప్రమాదవశాత్తు జారిపడిన వారిని గుర్తించి వారి బంధువులకు నష్టపరిహారం చెల్లిస్తాం. జీఆర్‌పీ సీఐ రాంమూర్తి

# తరగతి గది బోధనలో నూతన విధానం

జనగామ : ప్రాథమిక విద్య విషయంలో వినూత్న మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు ప్రారంభించిన ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం విజయవంతం కావడంతో ఈ ఏడాది మరిన్ని వన్నెలు అద్దారు. దీంతో విద్యార్థులు మరింత ఉల్లాసంగా అధ్యయనం చేసే వీలు దక్కింది. తాజాగా ఎఫ్ఏ పరీక్షలను ప్రత్యేకంగా నిర్వహించే క్రమంలో 5౦1 విధానంలో సాధించిన పురోగతినే ఫార్మేటివ్ అసెస్‌మెంట్‌గా నమోదు చేయనున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన టీచర్లు ఈ వివరాలను వెల్లడించారు.

5౦1 తరహా బోధన అంటే?

గతంలో పాఠ్యప్రణాళిక రూపొందించుకొని 2 ఎఫ్ఏలు, 4 ఎస్ఏ పరీక్షలు నిర్వహించే వారు. చాలా రోజుల క్రితం చదివిన పాఠాన్ని విద్యార్థులు జ్ఞాపకం ఉంచుకొని పరీక్షల్లో సమాధానాలు రాయడం అంత సులువు కాదని గుర్తించిన ప్రభుత్వం 5౦1 విధానాన్ని అమలు చేయనుంది. ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తూ.. ఐదు రోజుల పాటు పాఠాలు బోధించి ఆరో రోజు విద్యార్థి సాధించిన సామర్థ్యాలను మదింపు చేయడమే ఈ విధానం. విద్యార్థులు, ఉపాధ్యాయులు కచ్చితంగా ఐదు రోజుల పాటు పాఠశాలకు హాజరవ్వాలి. కచ్చితంగా ఐదు రోజుల బోధన జరిగాకే ఆరో రోజు వర్క్‌షీట్‌లో సమాధానాలు రాయాల్సి ఉంటుంది.

వర్క్ పుస్తకాల్లో సమాధానాలు

ప్రస్తుతానికి అమలులో ఉన్న 220 పనిదినాల్లో సరళీకరించిన పాఠ్యాంశాలను బోధించడానికి 140 బోధన రోజులు సరిపోతాయన్న నిపుణుల సూచన మేరకు వర్క్ బుక్‌లను రూపొందించారు. అంతకు ముందు సాగిన ఐదు రోజుల బోధన అనంతరం ఆరో రోజు విద్యార్థులు వర్క్‌బుక్‌లో సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఇందు కోసం ప్రభుత్వం తగినన్ని వర్క్‌బుక్‌లను విద్యార్థులకు ఉచితంగా అందిస్తుంది. వీటిని పాఠశాలలో భద్రపరిచినా లేదా విద్యార్థులు రోజూ ఇంటికి తీసుకెళ్లినా సరిపోతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రతి తరగతిలో విద్యార్థి సాధించాల్సిన సామర్థ్యాల గురించి ప్రభుత్వం ఇదివరకే ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేసింది.

ఉపాధ్యాయులకు శిక్షణ

రాష్ట్ర వ్యాప్తంగా చురుకైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి కరదీపికల వాడకంపై హైదరాబాదులో ప్రభుత్వం శిక్షణ ఇచ్చింది. వీరు జిల్లా




కేంద్రంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. తెలుగు, ఆంగ్లం, గణితం పాఠ్యాంశాల బోధనలో ఉపాధ్యాయుల అనుసరించాల్సిన విధానాలు, వర్క్‌బుక్‌లో విద్యార్థి సామర్థ్యాలను ఎలా నమోదు చేయాలో వివరిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బోధనలో నవ్యత కనబరిచే సీనియర్ ఉపాధ్యాయుల నుంచి వర్క్‌బుక్స్, ఉపాధ్యాయుల కరదీపికలను రాయించారు. కనీసం 80 శాతం మంది విద్యార్థులు మెరుగైన ప్రతిభ చూపితేనే మరో పాఠంలో బోధన మెదలుపెట్టాల్సి ఉంటుందని రాష్ట్రస్థాయి శిక్షణ పొందిన ఉపాధ్యాయుడు చెప్పారు. దీంతో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల ఉపస్థితి కీలకం కానుంది.

ఈ నెల నుంచే ప్రారంభం

5౦1 విధానంలో సాగే బోధన కోసం సన్నద్ధం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా తెలుగు, ఆంగ్లం, గణితం పాఠ్యాంశాల్లో అనుసరించాల్సిన విధానాలపై ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. నియత విద్యకు సంబంధించి తరగతి గది బోధనకు అంతరాయం కలగకుండా వంతుల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ నెలలో నిర్వహించే విద్యా వారోత్సవాల సందర్భంగా లాంఛనంగా ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# సెలవులు... ఉపనియుక్తాలు

గోదావరిఖని : వీలైతే ఉపనియుక్తం(డిప్యుటేషన్)తో ఇతర మున్సిపాలిటీల్లోకి వెళ్లడం... లేదంటే సెలవుపై వెళ్లడం ఇదీ రామగుండం నగరపాలికలోని ప్రధాన అధికారులు వ్యవహరిస్తున్న తీరు. బిల్లుల చెల్లింపు, అభివృద్ధి పనులపై గుత్తేదారుల ఒత్తిళ్లు, స్థానిక ప్రజాప్రతినిధుల్లో నెలకొన్న విభేదాలు తదితర కారణాలతో రామగుండంలో పనిచేసేందుకు అధికారులు సుముఖత వ్యక్తం చేయడం లేదు. నగరపాలక నిర్వహణలో కీలకమైన ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల్లోనే ఈ పరిస్థితి నెలకొంది. పట్టణ ప్రణాళిక విభాగంలోని అధికారులంతా ఉపనియుక్తంతో ఇతర మున్సిపాలిటీల్లోకి వెళ్లడంతో కార్యాలయం ఖాళీ అయింది. ఒకరు మరో మున్సిపాలిటీకి ఇంఛార్జీగా వెళ్లగా వారంలో రెండు రోజులు రామగుండంలో విధులు నిర్వహిస్తుంటారు.

వేతనం ఇక్కడ .. విధులు మరో చోట

వేతనాలు మాత్రం రామగుండం నగరపాలికలో తీసుకుంటున్న పట్టణ ప్రణాళిక విభాగంలోని అధికారులు విధులు మాత్రం తమకు నచ్చిన మున్సిపాలిటీల్లో నిర్వహిస్తున్నారు. ఈ విభాగం నిర్వహణలో కీలకపాత్రను పోషించాల్సిన ఉన్నతాధికారి అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఉపనియుక్తంతో మరో మున్సిపాలిటీలో పనిచేస్తున్నారు. పట్టణ ప్రణాళికాధికారి(టి.పి.ఒ.)రెండు పోస్టుల్లో ఒకటి ఖాళీగా ఉండగా ఒకరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం ఐదుగురు పట్టణ ప్రణాళిక పర్యవేక్షకుల్లో నలుగురు ఉపనియుక్తంతో ఇతర మున్సిపాలిటీల్లో పని చేస్తున్నారు. ఒకరు మాత్రం మరో మున్సిపాలిటీకి ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తూ వారంలో రెండు రోజులు రామగండం వస్తుంటారు.



ఆరు బిల్డింగ్ ఇన్‌స్పెక్టరు పోస్టులు ఖాళీయే.

కీలక శాఖలో సెలవులు

నగరపాలిక నిర్వహణలో కీలకమైన ఇంజినీరింగ్ విభాగంలోని అధికారులు సెలవుల్లో వెళ్తుండడంతో నిర్వహణలో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రామగుండం నగరపాలికలో నాలుగు డీఈ పోస్టులుండగా ఒకరు మాత్రమే పనిచేస్తున్నారు. వారు సైతం సెలవులో వెళ్లారు. మరో ఏఈకి డీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. నగరపాలక ఈఈ పోస్టులు రెండు ఉండగా ఇక్కడ పనిచేయాల్సిన ఈఈ మరో నగరపాలికలో ఉపనియుక్తంతో పనిచేస్తూ అవినీతి నిరోధక శాఖకు చిక్కడంతో ఒకరు మాత్రమే రామగుండంలో పనిచేస్తున్నారు. ఇటీవల కమిషనర్ బదిలీ కావడంతో ఇంజినీరింగ్‌లోని ఒకే ఒక్క ఈఈకి కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

వెనక్కి రప్పించేందుకు చర్యలు

సుచరణ్, నగరపాలక కమిషనర్ ఉపనియుక్తంతో, సెలవుల్లో వెళ్లినవారిని వెనక్కి రప్పించాల్సిందిగా ఉన్నతాధికారులకు లేఖలు రాశాం. ఇంజినీరింగ్ విభాగంలో సెలవులు, పట్టణ ప్రణాళిక విభాగంలో ఉపనియుక్తాలతో నగరపాలిక నిర్వహణ భారంగా మారింది. ఉపనియుక్తాలు రద్దు చేసి తిరిగి రామగుండంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు లేఖలు రాశాం.

# రెండు గ్రామాలు.. 250 ఎకరాలు

గోదావరిఖని : అధికారుల అనాలోచిత చర్యలతో అన్నదాతలకు తీరని నష్టం ఏర్పడింది. చెక్‌డ్యాం నిర్మాణంలో లోపాలు, ఓ ప్రైవేటు వ్యక్తికి ఇసుక రీచ్‌కు అనుమతి ఇవ్వడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మూలవాగులో వరద ఉద్ధృతంగా ప్రవహించి పంట పొలాల్లో భారీగా ఇసుక మేటలు వేశాయి. పంట పొలాలు కోతకు గురై బీడు భూములను తలపిస్తున్నాయి. పంటలు సాగు చేయడానికి వీల్లేని విధంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోనరావుపేట మండలం మామిడిపల్లిలో 200 పైగా, బావుసాయిపేటలో 50 ఎకరాల్లో పంట పొలాలు మూలవాగు వరద ఉద్ధృతికి కోతకు గురయ్యాయి. ఎకరా వరి సాగుకు రైతులు సుమారు రూ.20 వేల పైగా పెట్టుబడి పెట్టి వరి నాట్లు వేసిన పక్షం రోజులకే భారీ వర్షాల కారణంగా వరద వచ్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. బావుసాయిపేటకు చెందిన ఓ వ్యక్తి బావుసాయిపేట-మామిడిపల్లి మధ్య తన సొంత పట్టాభూమిలో ఇసుక ఉందని రెండేళ్ల క్రితం మూలవాగులో ఇసుక రీచ్‌కు అనుమతి పొందాడు. ఇసుకను తరలించడానికి ప్రధాన రోడ్డు నుంచి వ్యవసాయ క్షేత్రాల ద్వారా మూలవాగు వరకు తాత్కాలిక రోడ్డు నిర్మించి లారీలతో తరలిస్తున్నారు.



దీనికి తోడు ఇసుక రీచ్ ఏర్పాటు చేసిన ప్రదేశంలో మూలవాగు వంపు ఉండటంతో ఎగువన కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వరద ఉద్ధృతంగా పారడంతో పంట పొలాల్లోకి చేరింది. మూలవాగు నుంచి వేములవాడ ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకొని సుమారు 300 మీటర్ల మేర పారింది. వరద తాకిడికి పంట పొలాలు పెద్ద ఎత్తున కోతకు గురికావడంతోపాటు ఇసుక మేటలు వేశాయి. మామిడిపల్లి, బావుసాయిపేట గ్రామాల్లోని సుమారు 250 ఎకరాలు నామ రూపాల్లేకుండా కొట్టుకుపోయి వాగును తలపిస్తున్నాయి. ఇప్పట్లో పంటలు సాగు చేయడానికి వీల్లేకుండా మారాయి. మళ్లీ వీటిని సాగుకు అనుకూలంగా మార్చడానికి లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# మద్యం టెండర్ల హడావుడి షురూ!

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మద్యం టెండర్ల హడావుడి మొదలైంది. నేటి నుంచి మొదలు పెట్టి 22వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆబ్కారీ అధికారులు పనులు మొదలు పెట్టారు. ఖమ్మం జిల్లాలో 122 దుకాణాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 89 మద్యం దుకాణాలు ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో 60, ఖమ్మం జిల్లాలో 4 ఏజెన్సీ పరిధిలో ఉన్నాయి. ఏజెన్సీలో మద్యం దుకాణాల కేటాయింపునకు పంచాయతీ తీర్మానాలు చేయాల్సి ఉంటుంది.

అన్ని వస్తాయా..రెండేళ్ల కిందట జరిగిన టెండర్లలో ఖమ్మం జిల్లాలో రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. 122 దుకాణాలకు 6,213 మంది పోటీ పడ్డారు. దరఖాస్తుల విక్రయంతోనే రూ.124.26 కోట్లు సమకూరాయి. గతంలో మద్యం వ్యాపారం చేసేవారే దరఖాస్తులు వేసే వారు. ఇప్పుడు అదృష్టం పరీక్షించుకుందామనే వారి సంఖ్య పెరిగింది. రెండేళ్ల కిందట నూతన మద్యం పాలసీ అమల్లోకి తెచ్చారు. గత టెండర్లలో అత్యధికంగా చర్చలో నిలిచిన మధిర స్టేషన్ పరిధిలోని రాజుపాలెం దుకాణానికి అత్యధికంగా 121 మంది పోటీ పడ్డారు. ఖమ్మం నగరంలోని పదో నెంబరు దుకాణానికి అతి తక్కువగా 21 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే వ్యాపారంలో ఉన్న వారు టెండర్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆబ్కారీ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. ఇప్పుడు డ్రాలో దుకాణం వరించినా డిసెంబరు 1 నుంచే వ్యాపారం ప్రారంభించాల్సి ఉంది. అదే నెలలో ఎన్నికలు ఉంటాయి.

ముందస్తు మద్యం టెండర్ల విషయం జిల్లా ఆబ్కారీ అధికారి నాగేంద్రరెడ్డి



వద్ద ప్రస్తావించగా ఏర్పాట్లలో ఉన్నామని, నిబంధనల ప్రకారమే టెండర్లు ఉంటాయని, పెద్ద మార్పులు ఉండబోవన్నారు.

ప్రక్రియ ఇలా...మద్యం దుకాణాల కేటాయింపు టెండర్ల విధివిధానాలను ప్రభుత్వం ప్రకటించింది. ఆగస్టు 3న ప్రారంభించి 22వ తేదీ వరకు ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొంది. 3న రిజర్వుడు దుకాణాల గుర్తింపు, 4వ తేదీ నుంచి 18 వరకు దరఖాస్తుల విక్రయం, 21న డ్రా, 22న డ్రా వచ్చిన వారి నుంచి మొదటి కిస్తీ కట్టించుకుంటారు. డిసెంబరు 1వ తేదీ నుంచి లైసెన్సీలు తమ వ్యాపారాన్ని ప్రారంభించాల్సి ఉంటుంది.

ప్రక్రియ పూర్తి చేయండి: సీఎస్

2023-25 సంవత్సరాలకు ఏ4 మద్యం దుకాణాలకు లైసెన్స్ జారీ ప్రక్రియ షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె ఈ మేరకు ఆదేశించారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. జిల్లాలోని 122 ఏ4 దుకాణాల్లో 18 గౌడలకు, 14 ఎస్సీలకు, 8 ఎస్టీలకు, 82 జనరల్‌కు కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి సత్యనారాయణ, గిరిజన సంక్షేమ అధికారి కృష్ణనాయక్, బీసీ సంక్షేమ అధికారి జ్యోతి పాల్గొన్నారు.

# లక్ష్యానికి మించి.. రుణమిచ్చి..!



కొత్తగూడెం : బ్యాంకర్లు, వివిధ సంక్షేమశాఖ అధికారులు సమన్వయంతో 2023-24 వార్షిక రుణ ప్రణాళికలు రూపొందించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో వ్యవసాయ, అనుబంధ రంగాలు, పారిశ్రామిక, మహిళా సంఘాలు, తదితరాలకు ప్రాధాన్యమిచ్చారు. ఇటీవల కలెక్టర్ల సమక్షంలో వీటికి ఆమోదం తెలిపారు. రూ.6,432.40 కోట్లతో ఖమ్మం జిల్లా, రూ.5,218.11 కోట్లతో భద్రాద్రి జిల్లా వార్షిక రుణ ప్రణాళికలు ఖరారయ్యాయి.

ఈసారీ.. అండగా నిలవాలని

ఉభయ జిల్లాల పరిధిలో ఈసారి రుణ ప్రణాళికలను పకడ్బందీగా అమలుచేయాలని నిర్ణయించారు. రాయితీ రుణాలు మంజూరుచేసి నిరుద్యోగులు, వ్యాపారులకు అండగా నిలవాలని ప్రభుత్వం భావిస్తోంది. కొన్ని బ్యాంకుల్లో రుణాల మంజూరుకు అనేక రకాల ధ్రువపత్రాలు అడుగుతున్నట్లు రుణ గ్రహీతలు వాపోతున్నారు. అందుకే బ్యాంకు రుణాల్లో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. ప్రభుత్వ పథకాలకు షరతులు లేకుండా రుణాలివ్వాలని కోరుతున్నారు.

ప్రాధాన్య, ప్రాధాన్యేతర రంగాలు..

ప్రాధాన్య, ప్రాధాన్యేతర రంగాల వారీగా వార్షిక రుణ ప్రణాళిక రూపొందిస్తారు. ప్రాధాన్య రంగంలో పంట రుణాలు, నీటిపారుదల సౌకర్యాల కల్పన, వ్యవసాయ యంత్రాల కొనుగోలు, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు స్వయం సహాయక సంఘాలు తదితర వాటికి సంబంధించినవి ఉంటాయి. ప్రాధాన్యేతర రంగంలో గృహ, కమర్షియల్ రుణాలు అందిస్తుంటారు. ప్రాధాన్య రంగంలో ఏదైనా సొంతగా వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి బ్యాంకర్ల నిర్లక్ష్యం, సంబంధిత శాఖల అధికారుల అలసత్వం కారణంగా రుణాలు సక్రమంగా అందడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలనుకున్న యువతకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ఖమ్మం భేష్..!సాగుభూమి విస్తీర్ణం అధికంగా ఉండటం, 1/70 చట్టం అమలులో లేకపోవటం వల్ల వ్యాపార లావాదేవీలు ఎక్కువగా జరగటం, రైతులు తమ పొలాలను మార్ట్‌గేజ్ చేసుకోవటం ద్వారా అధిక రుణాలు పొందటం తదితర కారణాలతో ఖమ్మం జిల్లాలో బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యం కంటే అధికంగా రుణాలు ఇవ్వగలుగుతున్నారు. గతేడాది సుమారు 174 శాతం మేర రుణాలు అందించారు. భద్రాద్రి జిల్లాలో 97 శాతానికి పరిమితమయ్యారు. ఈ ఏడాది వార్షిక రుణ ప్రణాళికలో ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు కృషి చేస్తాం. నిరుడు పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యువల్ చేసుకోకపోవటం వల్ల వ్యవసాయ రంగంలో రుణ లక్ష్యాన్ని సాధించలేకపోయాం. ఈ ఏడాది సమస్యను అధిగమిం చేలా రైతులకు అవగాహన కల్పిస్తాం. కొన్ని సందర్భాల్లో ఆర్బీఐ మార్గదర్శకాలు పాటించాల్సి రావడంతో బ్యాంకు రుణాలు ఆలస్యమ వుతున్నాయి.- రాంరెడ్డి, లీడ్‌బ్యాంక్ మేనేజర్, భద్రాద్రి

# వరద పోటు.. భగీరథకు చేటు

వరంగల్ : వరదల దాటికి జిల్లాలో పలుచోట్ల మిషన్ భగీరథ పైప్‌లైన్లు దెబ్బతిని లీకేజీలు పడ్డాయి. దీంతో తాగునీరు కలుషితం అవుతోంది. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే వర్షాకాలం.. కలుషిత నీటితో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని పలు కాలనీల్లో సుమారు 41.3 కి.మీటర్ల మేర పైప్‌లైన్ దెబ్బతినడంతో సుమారు రూ.25 కోట్ల నష్టం వాటిల్లినట్లు గ్రేటర్ వరంగల్ ఇంజినీర్లు అంచనా వేశారు. నర్సంపేట డివిజన్ పరిధిలోనూ పలుచోట్ల పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. హనుమకొండ ప్రాంతంలో జవహర్‌నగర్, గోపాల్‌పూర్, సమ్మయ్యనగర్, విద్యానగర్, నయీంనగర్, వరంగల్ ప్రాంతంలో దేశాయిపేట, సీకేఎం కళాశాల కూడలి, ఎల్బీనగర్ గణేష్ కాలనీ, ఒయాసిస్ పాఠశాల గల్లీ, భద్రకాళి రోడ్, సరస్వతి కాలనీ, పోతననగర్, శ్రీనివాస కాలనీ, మట్టెవాడ పోలీసు స్టేషన్ మలుపు, రామన్నపేట బీసీ కాలనీ, సంతోషిమాత కాలనీ-2, ఎన్టీఆర్‌నగర్, డీకేనగర్, బీఆర్‌నగర్ తదితర ముంపు కాలనీల్లో పైపులైన్లు దెబ్బతిన్నాయి. నల్లా కనెక్షన్లు కొట్టుకు పోయాయి.

11వ డివిజన్ ఎంజీఎం ఆసుపత్రి ఎదురుగా శ్రీనివాస కాలనీ



ప్రాంతీయ కంటి ఆసుపత్రికెళ్లే పైపులైన్ లీకేజీతో కలుషితమైన నీరు సరఫరా అవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో పైపులైన్‌లోకి బురద చేరింది. 28వ డివిజన్ బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీ-2, సాయినగర్ కాలనీలకు తాగునీటి సరఫరా అంతంత మాత్రమే చేస్తున్నారు. ఎన్టీఆర్‌నగర్‌కు నీటి సరఫరా పునరుద్ధరించ లేదు.

విలీన గ్రామాలకు వాగు నీరే శరణ్యం

పైపుతో బకెట్‌లో నీళ్లు పడుతున్న ఈమె పేరు పూలమ్మ. నర్సంపేట పట్టణం ద్వారకపేట. గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి కూడా వీరికి పాకాల వాగు నీరే దిక్కు. పురపాలికలో విలీనమైనా రక్షిత నీరు అందడం లేదు. వాగు నీటిని మోటార్ల సాయంతో నేరుగా ట్యాంకుకు ఎక్కించి పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలకు వాగులో మట్టితో కూడిన నీళ్లు ప్రవహిస్తున్నాయి. అధికారులు ఏ నీటినే సరఫరా చేస్తుండటంతో వ్యాధులు సోకే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

వ్యాధుల ముప్పు పొంచి ఉంది..

కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా, పచ్చకామెర్లు వచ్చే అవకాశం ఉంటుంది. కలుషిత నీరు, ఆహారం ద్వారా విబ్రియో కలరా బ్యాక్టీరియా చిన్నప్రేగులోకి పోవడం వల్ల తీవ్రమైన అతిసార వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకినవారికి నీళ్ల విరోచనాలు, వాంతులు కావడంతో పాటు కాళ్లు తిమ్మిరెక్కడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఒకటి, రెండు గంటల వ్యవధిలో పలుమార్లు నీళ్ల విరేచనాలు కావడం, మలంలో రక్తం పడటం, తరచూ వాంతులు, తీవ్రమైన దాహం కలగటం, నీళ్లు తాగబుద్ధి కాకపోవడం, తినడానికి ఆసక్తిలేక నీరసంగా ఉండటం వంటి లక్షణాలు ఉంటే డయేరియాగా గుర్తించి వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు : కాచి చల్లార్చిన నీటిని వడకట్టి మాత్రమే తాగాలి. ఆహార పదార్థాలు ఎప్పటికప్పుడు వండుకొని వేడివేడిగా తినాలి. నిల్వ ఆహార పదార్థాలు అసలు తీసుకోవద్దు.

భోజనానికి ముందు, తర్వాత, మల, మూత్ర విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. విరేచనాలు అయితే గ్లూకోజ్ నీరు తాగించాలి. అత్యవసరమైతే దగ్గరలోని వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. నీరు, ఆహారం కలుషితం అవటం వల్ల వచ్చే ప్రాణాంతక వ్యాధి పచ్చకామెర్లు. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం, కాచి చల్లార్చిన నీరు తాగటం వల్ల ఈ వ్యాధి రాకుండా నివారించవచ్చు. హైపటైటిస్ వచ్చిన వారిలో ఎక్కువ మంది వాంతులు, వికారంతో బాధపడుతుంటారు. వీరికి గ్లూకోజ్ ఎక్కువగా ఇవ్వాలి. దాంతోపాటు పళ్ల రసాలు, కొబ్బరి నీరు తాగించాలి.

డా. పోరళ్ల సమ్మయ్య, అసోసియేట్ ప్రొఫెసర్, ఎంజీఎం ఆసుపత్రి

# కచ్చితత్వం.. పారదర్శకం




ఖమ్మం : ఇల్లు, అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్, ఖాళీ స్థలం, వాణిజ్య భవనంలో గదులు కొనుగోలు చేసిన వారు డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయాలంటే సబ్ రిజిస్ట్రార్ కచ్చితంగా బయోమెట్రిక్(వేలిముద్ర) వేసిన తర్వాతే ఆన్‌లైన్‌లో ఆయనకు కనిపిస్తుంది. ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు సంబంధిత సబ్ రిజిస్ట్రార్ ప్రతిసారి బయోమెట్రిక్ వేయాల్సిందే. దీంతోపాటు ప్రతి డాక్యుమెంట్‌కు ఇల్లు, ఖాళీ స్థలం వివరాలు తెలిపే గూగుల్ మ్యాప్ జతపరచాల్సిందే. లేకుంటే రిజిస్ట్రేషన్ కాదు. రాష్ట్రవ్యాప్తంగా నెలరోజులుగా ఈ విధానం అమల్లోకి వచ్చింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని ఆన్‌లైన్‌లో పారదర్శకంగా డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ విధానం అమలులోకి తెచ్చారు. మొదటి వారం, పది రోజులు ఈ విధానంలో కొంత ఆలస్యం జరిగిందని వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేసినా ప్రస్తుతం నూతన విధానం గాడిలో పడింది.

గతంలో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సమయంలో సెక్షన్‌లో క్రయ, విక్రయదారులు, సాక్షుల ఫొటోలు నమోదు చేసి, వారి ఆధార్ కార్డుల వివరాలు, వేలి ముద్రలు తీసుకునేవారు. అవి డాక్యుమెంట్ పత్రం వెనుక భాగంలో ప్రింట్ అయ్యేవి. ఆ డాక్యుమెంట్‌ను సబ్ రిజిస్ట్రార్ వద్దకు పంపితే చెక్ లిస్ట్ సరి చూసుకుని సంతకం చేయడంతో రిజిస్ట్రేషన్ పూర్తయ్యేది.

నూతన విధానంలో సెక్షన్‌లో క్రయ, విక్రయదారుల వేలిముద్రల ప్రక్రియ పూర్తయిన తర్వాత డాక్యుమెంట్ సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లినా కొనుగోలు చేసిన వ్యక్తులు వెళ్లాల్సిన అవసరం లేదు. ఆ డాక్యుమెంట్‌ను ఆన్‌లైన్‌లో సబ్ రిజిస్ట్రార్ పరిశీలించేందుకు తన బయోమెట్రిక్ ఉపయోగించి ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ వివరాలు పరిశీలించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌తో పాటు మాన్యువల్ డాక్యుమెంట్‌లో వివరాలు సరి చూసుకుని ఆయన ఆన్‌లైన్‌లో డిజిటల్ సంతకం, మాన్యువల్ పత్రాలపై పెన్నుతో సంతకం చేయాలి. అప్పుడే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుంది.

ప్రతి ఆస్తి వివరాలు వెల్లడించే గూగుల్ మ్యాప్ డాక్యుమెంట్ పత్రాలకు జత చేయాలి. ఆ మ్యాప్‌లో సూచించే అక్షాంశ, రేఖాంశాలను అనుసరించి మొబైల్‌లోని గూగుల్ మ్యాప్స్ ద్వారా సదరు ఇల్లు, భవనం ఎక్కడ ఉందో సబ్ రిజిస్ట్రార్ సహా, కొనుగోలుదారు పరిశీలించవచ్చు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకోవచ్చు. ఏవైనా అభ్యంతరాలుంటే సరి చేసుకునే అవకాశం కల్పిస్తారు. ఈ విధానం వల్ల డబుల్ రిజిస్ట్రేషన్లు, వేరే సర్వే నెంబర్, ఇతర ప్లాటు పొరపాటుగా రిజిస్టర్ చేయడం వంటివి తొలగిపోతాయి.

సాంకేతికతను ఉపయోగిస్తున్నాం..-అడపా రవీంద్రబాబు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, ఖమ్మం సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రక్రియలో మార్పులు చేశారు. ప్రతి డాక్యుమెంట్ పరిశీలనకు సంబంధిత సబ్ రిజిస్ట్రార్ బయోమెట్రిక్ ఉపయోగించి ఆన్‌లైన్‌లో వివరాలు పరిశీలించాల్సి ఉంటుంది. గూగుల్ మ్యాప్ వల్ల ప్లాటు, ఇల్లు క్షేత్రస్థాయిలో ఎక్కడుందో కచ్చితంగా తెలుసుకునే వీలుంది. నూతన విధానం వల్ల చాలా వరకు కచ్చితత్వం పెరుగుతుంది.

# లీకేజీల మయం.. తాగునీరు కలుషితం

వరంగల్ : వరదల దాటికి జిల్లాలో పలుచోట్ల మిషన్ భగీరథ పైప్‌లైన్లు దెబ్బతిని లీకేజీలు పడ్డాయి. తాగునీరు కలుషితం అవుతోంది. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలే వర్షాకాలం.. కలుషిత నీటితో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని పలు కాలనీల్లో సుమారు 41.3 కి.మీటర్ల మేర పైప్‌లైన్ దెబ్బతినడంతో సుమారు రూ.25 కోట్ల నష్టం వాటిల్లినట్లు గ్రేటర్ వరంగల్ ఇంజినీర్లు అంచనా వేశారు. హనుమకొండ ప్రాంతంలో జవహర్‌నగర్, గోపాల్‌పూర్, సమ్మయ్యనగర్, విద్యానగర్, నయీంనగర్, వరంగల్ ప్రాంతంలో దేశాయిపేట, సీకేఎం కళాశాల కూడలి, ఎల్బీనగర్ గణేష్ కాలనీ, ఒయాసిస్ పాఠశాల గల్లీ, భద్రకాళి రోడ్, సరస్వతి కాలనీ, పోతననగర్, శ్రీనివాస కాలనీ, మట్టెవాడ పోలీసు స్టేషన్ మలుపు, రామన్నపేట బీసీ కాలనీ, సంతోషిమాత కాలనీ-2, ఎన్టీఆర్‌నగర్, డీకేనగర్, బీఆర్‌నగర్ తదితర ముంపు కాలనీల్లో పైపులైన్లు దెబ్బతిన్నాయి. నల్లా కనెక్షన్లు కొట్టుకు పోయాయి.

కమలాపూర్‌లో..

కమలాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి ట్యాంకుల వద్ద సరిగా శుభ్రత పాటించడం లేదు. కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని భగీరథ మంచినీటిని 'న్యూస్‌టుడే' పరిశీలించగా గేటు వాల్వ్ దగ్గర వరద నీరు పైపు లైన్‌లో కలిసింది.

హనుమకొండ జవహర్‌కాలనీలో వరద కారణంగా పైపులైన్ ధ్వంసమైంది. ప్రధాన పైపు నుంచి తాగునీరు లీకై ఇలా రోడ్డుపక్కన గుంతలా మారింది. మిషన్ భగీరథ పైపులు సైతం పగిలిపోయాయి. తాగు నీరు వృథాగా బయటకు పోతుంది.

కలుషిత నీరుతో వచ్చే వ్యాధులు

కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా, పచ్చకామెర్లు వచ్చే అవకాశం ఉంటుంది. కలుషిత నీరు, ఆహారం ద్వారా విబ్రియో కలరా బ్యాక్టీరియా చిన్నప్రేగులోకి పోవడం వల్ల తీవ్రమైన అతిసార వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకినవారికి నీళ్ల విరోచనాలు, వాంతులు కావడంతో పాటు కాళ్లు తిమ్మిరెక్కడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు : కాచి చల్లార్చిన నీటిని వడకట్టి మాత్రమే తాగాలి. ఆహార పదార్థాలు ఎప్పటికప్పుడు వండుకొని వేడివేడిగా తినాలి. నిల్వ ఆహార పదార్థాలు అసలు తీసుకోవద్దు. భోజనానికి ముందు, తర్వాత, మల, మూత్ర విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.

విరేచనాలు అయితే గ్లూకోజ్ నీరు తాగించాలి. అత్యవసరమైతే దగ్గరలోని వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

డా. పోరళ్ల సమ్మయ్య, అసోసియేట్ ప్రొఫెసర్, ఎంజీఎం ఆసుపత్రి

# కుయ్.. కుయ్.. వచ్చేశాయ్

ఖమ్మం : ఉమ్మడి జిల్లాలో అత్యవసర వాహన సేవలందించేందుకు 38 కొత్త అంబులెన్సులు అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ మంజూరు చేసిన 466 వాహనాలను ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ప్రారంభించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించిన వాహనాలు బుధవారం ఆయా జిల్లాల్లోని బేస్ సెంటర్లకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఉన్నవాటిలో కొన్ని పాడైపోవడం, టైర్లు అరిగిపోవడం వంటి కారణాలతో తరచూ అత్యవసర సేవలకు ఆటంకం ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో స్థానిక వాహనాలు అందుబాటులో లేకపోవడంతో వేరే ప్రాంతం నుంచి వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి. ఈ సమయంలో అత్యవసర వైద్యం అవసరమైన బాధితులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నూతన అంబులెన్సుల రాకతో ఇకపై ఇలాంటి సమస్యలు తొలగిపోనున్నాయి. వినియోగదారులకు తీరనున్న కష్టాలుఅత్యవసర వాహనాల్లో కొన్నింటి జీవితకాలం పూర్తై తరచూ మొరాయిస్తుండటంతో ఆస్పత్రులకు వెళ్లడానికి క్షతగాత్రులు, గర్భిణులు, బాలింతలు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటి స్థానంలో కొత్తవి అందుబాటులోకి రావడంతో వినియోగదారుల కష్టాలు తొలగనున్నాయి. ప్రమాద సంఘటనల సమయంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందిస్తూ 108 వాహనాల్లో ఆస్పత్రులకు తరలిస్తూ ప్రాణాలను కాపాడుతున్నారు. నిరుపేద గర్భిణులు, బాలింతలు వైద్య సేవల కోసం ఆస్పత్రులకు వెళ్లి రావడానికి అమ్మఒడి 102 వాహనాలు ఉపయోగపడుతున్నాయి. ఇక ఆస్పత్రుల్లో మరణించిన వారి మృతదేహాలను ఇంటికి తరలించేందుకు ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు పార్థివ వాహనాలు ఎంతో ఉపకరిస్తున్నాయి. 2005 నుంచి సంజీవనిగా సేవలందిస్తున్న అంబులెన్సులు కొన్ని పాడైపోయాయి. దీంతో నిర్వహణ బాధ్యతను చూస్తున్న ఈఎంఆర్ఐ సంస్థ మరమ్మతులతోనే సరిపెడుతూ సేవలందిస్తోంది. బాధితులను తరలించే క్రమంలో అంబులెన్సులు అకస్మాత్తుగా ఆగిన సంఘటనలు ఉన్నాయి. కొత్త వాహనాల రాకతో అత్యవసర సేవలు మరింత మెరుగుపడనున్నాయి. కొత్తగా మరో రెండు కేంద్రాలకు..ప్రభుత్వం నూతనంగా కేటాయించిన అంబులెన్సుల్లో 108, 102, 'పరమపద' వాహనాలు ఉన్నాయి. కొత్తగా కేటాయించిన వాహనాలు ఇప్పటికే వాటిస్థానాలకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఉన్నవాటిలో జీవితకాలం పూర్తై.. పాడైన లేని వాటి స్థానంలో 35 అంబులెన్సులు వచ్చాయి. ఖమ్మం జిల్లాలో రఘునాథపాలెం, ముదిగొండను కొత్త బేస్ లొకేషన్లుగా గుర్తిస్తూ మరో రెండు 108 వాహనాలను మంజూరు చేశారు.

# కరవు నేలపై జల సిరులు !

జనగామ : కరవు నేలగా పేరొందిన జనగామ ప్రాంతం నేడు జల సిరులతో కళకళలాడుతోంది. గతంలో ఇక్కడ వర్షపాతం తక్కువగా ఉండేది. ఏడాదిలో రెండు పంటలు పండించడమంటే గొప్ప విషయమే. స్థానిక ప్రజలకు ఉపాధి దొరకక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. జిల్లాలో పలు జలాశయాలు ఉన్నప్పటికీ వాటిలో నీళ్లు లేక బోసిపోయేవి. గోదావరి జలాల రాకతో పాటు ఇటీవల వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో పలు జలాశయాలు, చెరువులు, కుంటలు నిండిపోయి జలకళ సంతరించుకున్నాయి. వాగులు, చెరువులు మత్తళ్లు పోస్తున్నాయి.

సమృద్ధిగా భూగర్భ జలాలుఈ ప్రాంతంలో సుమారు లక్ష ఎకరాలు ఆయకట్టు పరిధిలో ఉండడంతో అధికంగా సాగవుతుందని అంచనా. ఇప్పటికే వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, జలాశయాలు పూర్తిగా నిండడంతో అధిక విస్తీర్ణంలో పంటలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతంలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో ఉపాధి పనులకు వెళ్లిన వ్యవసాయదారులు.. ఇప్పుడు భూగర్భ జలాలు పెరగడంతో మళ్లీ వ్యవసాయానికి మొగ్గు చూపుతున్నారు. కరవు ప్రాంతమైన జనగామ సస్యశామలం కావడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణంగతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగింది. సాగునీటి వనరులు పుష్కలంగా ఉండడంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కాలువల ద్వారా నీటిని పంట పొలాలకు తరలిస్తున్నారు. వచ్చే ఏడాది వరకూ సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది తాగు, సాగునీటికి ఇబ్బందులు తీరినట్లే.

అన్నదాతల హర్షంఎన్నడూ ఊహించని విధంగా జిల్లాలోని ప్రధాన జలాశయాలైన చీటకోడూరు, మల్లన్నగండి, వెల్దండ, బొమ్మకూరు, కన్నెబోయినగూడెం, నవాబ్‌పేట, అశ్వరావుపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్లు నిండిపోయి పొంగి పొర్లుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయాల్లోకి వరదనీరు చేరింది.

# మహిళా సమ్మాన్.. సెల్ఫీ దిగుదాం

ఖమ్మం : తపాలా కార్యాలయాల్లో ప్రధాన మంత్రికి ధన్యవాదాలు తెలిపే సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ మహిళా సమ్మాన్ పథకంలో చేరిన మహిళ ఫొటో తీసుకోవాలి. బలవంతం ఏమీ లేదు. ఇష్టపడేవారికి మాత్రమే. మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన మహిళా సమ్మాన్ పథకంపై అవగాహన కోసం ఇలాంటి ఏర్పాటు చేశారు. ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయంలో మహిళా సమ్మాన్ ఖాతా తెరిచిన మహిళలకు ఇక్కడి స్వియ చిత్ర పాయింట్‌ను చూపిస్తున్నారు. అందులో ఆసక్తి ఉన్న వారు ఫొటో దిగేందుకు సమ్మతిస్తున్నారు.

మహిళా సమ్మాన్ మహిళలకు మాత్రమే. తన పేరుపై, ఆడ పిల్లలు, మైనర్ బాలికలైతే సంరక్షకురాలి పేరుతో ఖాతా తెరవాల్సి ఉంటుంది.




రెండేళ్ల గడువు కాలం, వెయ్యి రూపాయల నుంచి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు పొదుపు చేసుకునే వెసులుబాటు, రెండు లక్షలతో ఖాతా తెరిచిన మహిళకు రెండేళ్ల గడువు తర్వాత రూ.2,32,044 అందజేస్తారు. ఖాతాలో చేరిన మహిళ ఓ ఏడాది తర్వాత కట్టిన మొత్తంలో 40 శాతం తీసుకోవచ్చు. వద్దనుకుంటే ఆరు నెలల తర్వాత ఉపసంహరించుకునే సదుపాయం ఉంది.

తపాలా కార్యాలయంలో లభించే దరఖాస్తు పూర్తి చేసి, ఆధార్, పాన్ కార్డులు సమర్పించి ఉమ్మడి జిల్లాలోని ఏ తపాలా కార్యాలయంలోనైనా ఖాతా తెరిచే సదుపాయం అందుబాటులో ఉంది. కొద్ది రోజుల్లోనే 300 మంది మహిళలు ఈ పథకంలో చేరారు.

# కొత్త మార్గంలో కార్గో!

వరంగల్ : కొవిడ్ నుంచి ఆర్టీసీ తన నష్టాలను పూడ్చుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. దీనిలో భాగంగానే 2020 జూన్‌లో కార్గో పార్శిల్ సేవలను ప్రారంభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9 డిపోల పరిధిలో 11 చోట్ల ఈ సేవలకు శ్రీకారం చుట్టింది. ప్రారంభించిన తొలినాళ్లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు రూ.5వేల నుంచి రూ.6 వేల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ.1.50లక్షల నుంచి రూ.1.60 లక్షలకు పైగా ప్రతిరోజూ సమకూరుతోంది. డిపో పరిధిలో ఒక మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ అధికారితో పాటు ఆర్టీసీ పొరుగు సేవల సిబ్బందిని ఈ సేవల కోసం ప్రత్యేకంగా నియమించారు. ఇటీవల కార్గోను లాజిస్టిక్‌గా మార్చిన అధికారులు దీనిని ప్రైవేటు ఏజెంట్లకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణ

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, తొర్రూరు, పరకాల, ములుగు ప్రాంతాల్లోని కార్గోలను కమీషన్ బేసిక్‌పై ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. అత్యధిక ఆదాయం వచ్చే హనుమకొండ, వరంగల్ కేంద్రాలను ఆర్టీసీ నిర్వహిస్తోంది. త్వరలోనే వీటిని కూడా ప్రైవేటు వారికి అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఏజెంట్లకు అప్పగిస్తే ఇప్పుడున్న ఆదాయానికంటే మరింత ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని ఆర్టీసీ



లెక్కలేస్తోంది. ఏజెంట్లకు అప్పగించడం వలన సిబ్బందిని వారే నియమించుకుంటారు. వీరిపై ఆర్టీసీకి చెందిన మార్కెటింగ్ అధికారి పర్యవేక్షణ చేస్తారు.

అధిక ఆదాయం వస్తుందనీ..

లాజిస్టిక్ కేంద్రాలను ప్రైవేటు వ్యక్తులకు 12 శాతం కమీషన్‌పై అప్పగించనున్నట్లు సమాచారం. దీనికి తోడు కేంద్రం నిర్వహణకు అద్దె చెల్లించడంతో పాటు పార్శిళ్ల ద్వారా వచ్చే ఆదాయంలోనూ ఆర్టీసీకి వాటా వస్తుందని అధికారులు చెబుతున్నారు. కరోనా సమయంలో బస్సులు సరిగా నడవలేని సమయంలో ఆర్టీసీ సిబ్బందిని కార్గో సేవలకు వినియోగించామని, ప్రస్తుతం వందశాతం బస్సులు నడుస్తుండడంతో.. తిరిగి వారి విధులనే కేటాయిస్తున్నామని పేర్కొంటున్నారు. అత్యధికంగా ఆదాయం వచ్చే కేంద్రాలను ప్రైవేటుకు అప్పగించడం సమంజసం కాదని సిబ్బంది ఆరోపిస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..- ఎం.వేణుగోపాల్, ఏటీఎం, లాజిస్టిక్ వరంగల్ రీజియన్ అధికారి

ఇప్పటికే హనుమకొండ, వరంగల్ మినహా అన్నికేంద్రాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ప్రైవేటుకు అప్పగించాం. కొవిడ్ సమయంలో ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో నడపకపోవడంతో.. సిబ్బందిని కార్గో సేవలకు ఉపయోగించాం. ప్రస్తుతం బస్సులు పూర్తిస్థాయిలో నడుస్తున్నాయి. లాజిస్టిక్ కేంద్రాలు ఇతరులకు అప్పగించడం వలన కార్యాలయాలకు అద్దెతో పాటు ఇతర ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ప్రైవేటుకు అప్పగించినా పూర్తిస్థాయిలో ఆర్టీసీ అధికారులే పర్యవేక్షిస్తారు.

# ఉద్యోగ భద్రతకు సహకారం




ఖమ్మం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఉత్తర్వు- 44 ప్రకారం దశాబ్దాల తరబడి పనిచేస్తున్న ఉద్యోగుల కల ఎట్టకేలకు నెరవేరింది. సహకార వ్యవస్థ ఏర్పడిన నాటి నుంచి వీరికి ఉద్యోగ భద్రత లేదు. సంఘాల అధ్యక్షుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలాంటి ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని, వేతనాలను స్థిరీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు సహకార సంఘాల అధ్యక్షులకు సైతం గౌరవ వేతనాన్ని సర్కారు పెంచింది. ఖమ్మం డీసీసీబీ పరిధిలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో 100 సహకార సంఘాలు ఉన్నాయి.

317 మంది ఉద్యోగులకు లబ్ధి

సర్కారు తాజా నిర్ణయం వల్ల సహకార సంఘాల్లో కార్యదర్శి, స్టాఫ్ అసిస్టెంట్, సబ్‌స్టాఫ్ క్యాడర్లలో పనిచేస్తున్న 317 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. అర్హుల జాబితాను డీఎల్ఈసీ (డీసీసీబీ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీ) నుంచి ఎస్ఎల్ఈసీ (స్టేట్ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీ)కి అధికారులు పంపించారు. ఖమ్మం జిల్లాలోని ఉద్యోగులకు శుక్రవారం నుంచి ఉత్తర్వులు జారీ కానున్నాయి.

బేసిక్‌పేపై 103 శాతం డీఏ, పదకొండు శాతం హెచ్ఆర్ఏ చెల్లిస్తారు. ఇది 2014 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. అంతకుముందున్న సర్వీసు పీరియడ్‌కు.. జీవో నంబరు-115 ప్రకారం 2009 మార్చి 31కి ముందు ప్రతి 18 నెలలకోసారి ఇంక్రిమెంట్ ఇస్తూ 2009 ఏప్రిల్ 1ని కటాఫ్ తేదీగా నిర్ణయించారు. 2009 ఏప్రిల్ 1 నుంచి 2014 మార్చి 31 వరకు ఏటా ఒక ఇంక్రిమెంట్ చొప్పున ఇస్తూ ఉద్యోగుల బేసిక్ పేను ఫిక్స్ చేశారు. 2021-22 ఆడిట్ రిపోర్టు ఆధారంగా పెరిగిన వేతనం చెల్లిస్తారు.

అధ్యక్షులకు పెరిగిన గౌరవం

పీఏసీఎస్‌ల అధ్యక్షులకు ఇప్పటివరకు గౌరవ వేతనం నెలకు రూ.1,250 అందింది. సంఘాల టర్నోవర్ ఆధారంగా గౌరవ వేతనమివ్వాలని సర్కారు తాజాగా నిర్ణయించింది. ఖమ్మం టేకులపల్లి ఆంధ్రాబ్యాంకు కర్షక సేవాసమితి అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి ఒక్కరే అత్యధికంగా గౌరవ వేతనం రూ.15వేలు పొందనున్నారు. ఈ సంఘం టర్నోవర్ రూ.41కోట్లు.

ఖమ్మం జిల్లాలో 221 మంది ఉద్యోగులకు 205 మంది సర్వీసును క్రమబద్ధీకరించి వేతనాలను స్థిరీకరించామని డీసీఓ విజయకుమారి తెలిపారు. సర్వీసులో అంతరాయం, ఇతర కారణాల వల్ల మరో 16 మందికి వర్తింపజేయలేదన్నారు.

# ప్రగతి పత్రాలు.. ఆన్‌లైన్‌లో



ఖమ్మం : పాఠశాల విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్షలు పూర్తయ్యాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం ఈ నెల 24తో ముగియనుంది. విద్యార్థుల ప్రశ్నపత్రాల మూల్యాంకన వివరాలు తెలిపే ప్రోగ్రెస్ కార్డుల (ప్రగతి పత్రాలు) పంపిణీ కరోనా నాటినుంచి నిలిచిపోయింది. ఈసారి ఆన్‌లైన్ ద్వారా అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈపాటికే నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక (ఎస్ఏ-1) పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, ఎస్ఏ-2 ఫలితాలనూ వెబ్‌సైట్‌లో నమోదు చేసేలా ఏర్పాటు చేస్తున్నారు.

గతంలో ఇలా..

2019-20 విద్యా సంవత్సరం వరకు ప్రతి విద్యార్థికి సంచిత సమగ్ర నివేదికలు అందించేవారు. అందులో విద్యార్థి వ్యక్తిగత వివరాలు, ఫొటో, మార్కులు, గ్రేడ్లు, తరగతి వారీగా ఆరోగ్య సమాచారం, వివరణాత్మక సూచనలు నమోదు చేసి దానిపై తల్లిదండ్రుల సంతకాలు తీసుకునేవారు. ప్రభుత్వం సరఫరా చేసే ఈ నివేదిక 25 పేజీలతో ఉండేవి. ఇందులో భాగమైన ప్రోగ్రెస్ కార్డులోనే విద్యార్థుల మార్కులుండేవి. పాఠశాల మారితే విద్యార్థి తన వెంట ఈ కార్డు తీసుకెళ్లి కొత్తగా చేరిన పాఠశాలలో అప్పగించేవారు. నాలుగేళ్లుగా సమగ్ర శిక్షాభియాన్ నిలిపివేయడంతో ప్రధానోపాధ్యాయులు పాఠశాల అభివృద్ధి నిధుల నుంచి ప్రైవేటుగా సమగ్ర నివేదిక తయారు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అరకొరగా వచ్చే నిధులు నిర్వహణకే సరిపోవడం లేదని, వీటి కొనుగోలు ఆర్థిక భారంగా మారిందని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పాత విధానానికి స్వస్తి పలికి విద్యార్థులకు ఇకనుంచి ఒకటే ఆన్‌లైన్ ప్రగతి పత్రాన్ని అందించనున్నారు. "ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఆన్‌లైన్ ప్రగతి పత్రాలు అందించే ఏర్పాటు చేస్తున్నాం. ఈ నెల 23లోగా నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక పరీక్షలకు సంబంధించిన ఫలితాలు నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం. విద్యార్థుల వారీగా ప్రగతి పత్రాలను సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసి ప్రింట్ తీసుకుని సిద్ధంగా ఉంచాలి. ఈ నెల 24న తల్లిదండ్రులతో చివరి సమావేశం నిర్వహించి ప్రతి విద్యార్థికి ఆన్‌లైన్ ప్రోగ్రెస్ కార్డులను అందించాలి."సోమశేఖరశర్మ, డీఈవో, భద్రాద్రి

# కరవు సీమలో పాల వెల్లువ

జనగామ : జనగామలోని పాల శీతలీకరణ కేంద్రం (విజయ డెయిరీ) రికార్డు స్థాయిలో పాలను సేకరిస్తోంది. పాల సేకరణలో రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. పాడి రైతులకు ప్రోత్సాహమందిస్తూ ప్రగతిపథంలో పయనిస్తోంది.

రోజూ 25 వేల లీటర్ల సేకరణ

జనగామ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోకి జిల్లాలోని 12 మండలాలతో పాటు యాదాద్రి-భువనగిరి జిల్లా రాజపేట, సిద్ధిపేట జిల్లా మద్దూరు మండలం కూడా వస్తాయి. వీటిలో మొత్తం 250 పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. 4వేల మందికి పాడి రైతులు పాలను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. గతంలో వివిధ మండలాల నుంచి సేకరించిన పాలను జనగామకు తీసుకొచ్చి హైదరాబాద్‌లోని విజయ డెయిరీకి పంపించేవారు. ఈ ఏడాది నుంచి జిల్లాలోని బచ్చన్నపేట, నర్మెట్ట, సింగరాజుపల్లి, లింగాలఘనపురం, చీటూరు, కామారెడ్డిగూడెంలో మినీ బల్క్ మిల్క్ సెంటర్ యూనిట్(బీఎంసీయూ)లను నెలకొల్పి సేకరించిన పాలను అక్కడే చిల్లింగ్ చేసి నేరుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహకాలు

విజయ డెయిరీ కేంద్రాలకు పాలను విక్రయించే రైతులకు పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. పశువులకు వాడే ఫోడర్ సీడ్, మినరల్ మిక్చర్, క్యాల్షియం, విజయ క్యాటిల్ ఫీడ్, డీవార్మింగ్ మందులు, టీకాలను రాయితీపై అందిస్తున్నారు. రైతుల కుటుంబాల్లో వివాహాలు జరిగితే రూ.5 వేలు కానుక పేరుతో అందిస్తున్నారు. మరణించిన రైతుల అంత్యక్రియలకు రూ.5 వేల సాయమందిస్తున్నారు. వారి పిల్లలు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిస్తే రూ.1000 ప్రోత్సాహక బహుమతిని విజయ డెయిరీ అందిస్తోంది. ముద్ర రుణాలు అందజేస్తున్నారు. రైతులు పాడి పశువులను కొనుగోలు చేసేందుకు ప్రధానమంత్రి రుణ పథకం, ముద్ర పథకాల్లో రూ.10 లక్షల చొప్పున ఎస్‌బీఐ రుణాలు మంజూరు చేయనుంది. ఈ పథకానికి ఇప్పటికే జనగామ జిల్లాలో 600 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

ప్రత్యేక కమిటీల ఏర్పాటు

గతేడాది ప్రతి మండలంలో 9 మంది చొప్పున పాడి రైతులతో కమిటీలను ఏర్పాటు చేశారు. కొత్తగా జిల్లాలో ఆరు పాల సేకరణ కేంద్రాలను సొసైటీలకు అప్పగించారు. జనగామ పాలశీతలీకరణ కేంద్రం ద్వారా సేకరిస్తున్న పాలు టెట్రా పాలకు కూడా అర్హత



పొందాయి. ఇప్పుడు జనగామ, ఇతర కేంద్రాల ద్వారా నేరుగా హైదరాబాద్‌కు పాలను రవాణా చేస్తున్నారు. ప్రయోగాత్మకంగా 'పాలమిత్ర' యాప్‌ను రూపొందించి జనగామ, బచ్చన్నపేట కేంద్రాల్లోని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యాప్ ద్వారా రైతులు కేంద్రాలకు పోస్తున్న పాలు, ధర, ఇతర సౌకర్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది. రానున్న రోజుల్లో జనగామలోని పాలశీతలీకరణ కేంద్రంలోనే పాల పొట్లాలు తయారు చేయాలని, మార్కెటింగ్ వసతులు కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.4 కోట్లు వెచ్చించి యంత్ర పరికరాలు తీసుకురానున్నారు.

ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం.. - జి.ధన్‌రాజ్, ఉపసంచాలకులు, జనగామ విజయ డెయిరీ

రానున్న రోజుల్లో రోజుకు 60 వేల లీటర్ల పాలు సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నాం. త్వరలో జనగామ కేంద్రంలో రూ.4 కోట్లతో పాల పొట్లాల తయారీని ప్రారంభించాలనుకుంటున్నాం. గ్రామాల్లో పశుగణన చేపట్టి పాల దిగుబడి పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి- జనగాం సోమిరెడ్డి, పాల ఉత్పత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

జనగామ పాలశీతలీకరణ కేంద్రంలో రికార్డు స్థాయిలో పాల సేకరణ చేసేందుకు చర్యలు చేపడతాం. రైతులకు రాయితీపై దాణా అందజేస్తున్నాం. గ్రామాల్లోని పాల కేంద్రాలను తరచూ సందర్శించి రైతుల కష్ట, నష్టాలను తెలుసుకుంటున్నాం. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

# మూతపడిన యంత్రాలు.. పని లేక రెండేళ్లు!

మహబూబాబాద్ : పసుపు ధర దిన దినం పడిపోవడంతో ఉపాధి నిలిచిపోయింది. పసుపు కొమ్ములకు పాలిష్ చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్న వ్యాపారుల ఆశలు నిరాశలయ్యాయి. ఒకటి కాదు రెండు కాదు లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న యంత్రాలు పని లేక తుప్పు పట్టిపోతుండటంతో తల్లడిల్లుతున్నారు. యంత్రాల కొనుగోలు చేసిన అప్పులు చెల్లించడానికి.. కరెంట్ బిల్లులు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆ భారాన్ని పూడ్చుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. ఈ పనిపై ఆధారపడిన 250 మంది కూలీలలో 200 మందికి పనుల్లేక వేరే పనులు దొరకక అవస్థలు పడుతున్నారు. పసుపు ధర తగ్గడంతో యంత్రాలు మూతపడ్డాయి. వ్యాపారులు, కూలీలు పడుతున్న ఇబ్బందులపై మానవీయ కథనం..

మొదట్లో కేసముద్రం విపణిలో పసుపు కొనుగోలు చేసిన వ్యాపారులు నిజామాబాద్‌కు తీసుకెళ్లి అక్కడ పాలిషింగ్ చేయించి ఇతర ప్రాంతాలకు విక్రయించే వారు. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో పసుపు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో రావడంతో కేసముద్రం విపణిలో విక్రయాలు పెరిగాయి. వ్యాపారులు నిజామాబాద్‌కు వెళ్లకుండా స్వయంగా ఇక్కడనే పసుపు పాలిషింగ్(డోలా) యంత్రాలను ఏర్పాటు చేసుకున్నారు. పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు, బంగ్లాదేశ్, చైనా, అరబ్ దేశాలకు ఎగుమతి చేస్తూ లాభాలు గడించారు. రెండు, మూడు యంత్రాలతో కొనసాగిన పాలిషింగ్ 20 యంత్రాలకు చేరింది. ప్రస్తుతం సాగు విస్తీర్ణం తగ్గడం. వరంగల్, కేసముద్రం మార్కెట్లకు ఏడాదికి సుమారు 8 లక్షల బస్తాలు విక్రయానికి వస్తే ధర లేక లక్ష బస్తాలు కూడా రావడం లేదు.

దుబ్బ పడుతున్న యంత్రాలు..



ఒక్కో వ్యాపారి యంత్రానికి రూ.10 లక్షలు, షెడ్, గోదాం నిర్మాణానికి మరో రూ.20 నుంచి రూ.25 లక్షల చొప్పున మొత్తంగా రూ.30 నుంచి రూ.35 లక్షలు వెచ్చించి 20 పాలిషింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకున్నారు. ఇప్పుడు పనులు లేక 15 యంత్రాలు దుబ్బపడుతున్నాయి. కొన్ని తుప్పుపట్టాయి. కరెంట్ బిల్లులు రూ.10 వేలు చెల్లిస్తున్నారు. కొందరు ఆ బిల్లులను కూడా చెల్లించడానికి డబ్బులు లేక 63 నుంచి 75 హెచ్‌పీ సామర్థ్యంతో ఏర్పాటు చేసుకున్న నియంత్రికలను తీసుకెళ్లాలని, కరెంట్ కనెక్షన్‌ను తొలగించాలని విద్యుత్తు శాఖ అధికారులకు విన్నవించుకుంటున్నారు.

నాణ్యత లేమి..

ఒకప్పుడు కర్కుమిన్, అయిల్ శాతం వ్యాపారులు నచ్చే విధంగా ఉన్నటువంటి పసుపులో ఇప్పుడు ఆ నాణ్యత ప్రమాణాలు తగ్గాయి. ఇందుకు ముఖ్య కారణం గత 30 ఏళ్ల నుంచి ఈ ప్రాంత రైతులు పసుపు సాగును ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. మంచి నాణ్యత ఉండడంతో గుర్తింపు లభించింది. అలాంటిది రైతులు ఏటా విత్తన మార్పిడి చేయకుండా పండించిన పంటనే తిరిగి విత్తనంగా వినియోగించడం వల్ల చీడపీడల బెడద పెరిగి నాణ్యత తగ్గింది.

దుబ్బపట్టిన పాలిషింగ్(డోలా) యంత్రాన్ని చూపుతున్న ఈ వ్యాపారి కేసముద్రానికి చెందిన అనుమాండ్ల వేణుగోపాల్‌రెడ్డి. 25 ఏళ్ల నుంచి మార్కెట్లో పసుపు ఖరీదు చేస్తున్నారు. పాలిషింగ్ చేసి ఇతర ప్రాంతాలకు విక్రయించే వారు. అంతకు ముందు కొనుగోలు చేసిన పసుపు బస్తాలు గోదాంలోనే నిల్వ ఉన్నట్లు ఆయన చెబుతున్నారు. నాణ్యమైన పంట వస్తేనే అర్డర్లు వచ్చి యంత్రాలకు పని కలుగుతుందని వాపోతున్నారు.

ఇలాంటి పరిస్థితులు వస్తాయనుకోలేదు

చిదిరాల వసంతరావు, కేసముద్రం

కేసముద్రం మార్కెట్ పరిధిలో గత 30 ఏళ్లుగా పసుపు ఖరీదు చేస్తున్నాను. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేశాం. పసుపు కొమ్ములకు మంచి డిమాండ్ ఉండేది. ప్రస్తుతం నాణ్యత లేక డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు ఖరీదు చేయడానికి ఇష్టపడడం లేదు. మార్కెట్‌కు పసుపు రాబడులు పూర్తిగా పడిపోయాయి. ఫలితంగా రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసుకున్న డోలా యంత్రాలను మూసేశాం. దీనిపై ఆధారపడిన కూలీలకు పనులు లేవు. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదు.

# గోదావరి.. నువ్వొస్తేనే సిరి

వరంగల్ : పాకాల సరస్సు అన్నదాతలకు అన్నపూర్ణ వంటిది, ఒకసారి నిండితే వానాకాలంలో 30వేల ఎకరాలు, యాసంగిలో 10వేల ఎకరాలు సాగవుతుంది. ఈ ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన పాకాలకు గోదావరి జలాలను తెచ్చేందుకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషి చేసి రెండేళ్ల కిందట యాసంగికి మూడు అడుగుల నీటిని అందించి రైతులకు భరోసా ఇచ్చారు. ప్రస్తుతం యాసంగిలో సరస్సు కింద 23 వేల ఎకరాల్లో యాసంగి సాగైంది. ప్రస్తుతం సరస్సులో 16.7 అడుగుల నీరుంది. ఇక పాకాలకు గోదావరి జలాల నిరంతర తరలింపుతోనే పంట చేతికందుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి భరోసా ఇస్తున్నా కార్యాచరణలో ఉన్న కొన్ని లోపాలతో అన్నదాతల్లో కొంత ఆందోళన నెలకొంది. అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులను కలిసి ఆయకట్టుకు నీటిపై మాట్లాడింది.

ఇప్పటికే సగం పెట్టుబడి పెట్టాం

సారంగపాణి, రైతు, అశోక్‌నగర్

ఆయకట్టు మొత్తం సాగుకు అనుమతిచ్చారు. ఇప్పటికే ఎకరాకు 30 వేల రూపాయలు పెట్టుబడి పెట్టాం. ఇంకా 45 రోజులు నీరు అవసరం. సంగెం కాలువకు రెండు అడుగులు నీటిమట్టం తగ్గితే ప్రవాహం తగ్గి నీరు అందదు. గోదావరి జలాలను నిరంతం తరలించాలి. నీటిమట్టం తగ్గకుండా అధికారులు శ్రద్ధ చూపాలి. లేదంటే రైతులకు అధికారులే పరిహారం చెల్లించాలి

తూములకు షట్టర్లు లేక వృథాఅచ్యుతం, రైతు, అశోక్‌నగర్పాకాల తూములకు, కాలువల బుర్రలకు తలుపులు ఉంటే నీటి వృథా తగ్గేది. ప్రస్తుతం నీరు ఎక్కువగా పాకాల వాగులోకి పోతుంది. పొలానికి నీరు పెట్టుకొని బుర్రలు బందు చేసుకునే వెసులు బాటు లేదు. సాగుకు అనుమతిచ్చిన అధికారులకు నీరందించాల్సిన బాధ్యత కూడా ఉంది.గోదావరి జలాలొస్తాయంటేనే 13 ఎకరాలు నాటేశా సాంబయ్య, రైతు ఖానాపురంపాకాలలోకి గోదావరి జలాలు వస్తాయన్న నమ్మకంతోనే 13 ఎకరాల్లో నాటేశా. సంగెం కాలువ కింద పరిస్థితి కాస్త ఇబ్బందిగానే ఉంది. రైతులు కూడా నీటిని వృథా చేయకుండా ఎగువ రైతులు దిగువ వారికి సహకరించాలి. రోజు నీటిని మోటార్లతో పాకాలకు తరలించాల్సిందే.

48 రోజులపాటు నిరంతరం నీరురమేష్, డీఈఈ, పాకాలఎమ్మెల్యే పెద్ది చొరవతో రామప్ప నుంచి గోదావరి జలాలను 48 రోజులు రోజుకు 300 క్యూసెక్కుల నీటిని తరలిస్తాం. పంట ఎండిపోకుండా చూస్తాం. రోజుకు 300 క్యూసెక్కులు వస్తుంటే 290 క్యూసెక్కుల నీరు పొలాలకు ప్రవహిస్తోంది. పురాతన కాలువలు కాబట్టి కొంత ఇబ్బంది ఉంది. కొన్ని కాలువల్లో నాచు పెరిగింది. తొలగించి నీరందిస్తాం. రైతులు నీటిని సంరక్షించుకోవాలి.




## ఆర్టీసీ బస్సుపై దాడి, వ్యాపారులకు బెదిరింపులు!

కుప్పం: చిత్తూరు జిల్లా కుప్పంలో వైకాపా అల్లరి మూకలు బీభత్సం సృష్టించాయి. నిరసనలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్సుపై దాడికి పాల్పడ్డారు. 40 మందితో కుప్పం డిపో బస్సు కృష్ణగిరి నుంచి తిరుమల వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ బస్సులో ఉన్న తమిళనాడుకు చెందిన ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. శనివారం ఉదయం వరకు ఆర్టీసీ బస్టాండ్‌లోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఈ దాడిలో బస్సు పాక్షికంగా దెబ్బతింది. కాగా పుంగనూరు దాడి ఘటనకు నిరసనగా నేడు వైకాపా బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ముందస్తు ప్రకటన లేకుండా బస్సులు నిలిపివేతతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

కుప్పంలో బంద్ పాటించాలంటూ వైకాపా కార్యకర్తలు దుకాణాలను బలవంతంగా మూసివేయించారు. ఓ వస్త్ర దుకాణంలోని వస్త్రాలను బయటపడేసి బెదిరింపులకు పాల్పడ్డారు.

## జగన్ కే ఎలా వస్తాయి ఈ ఆలోచనలు... సురక్ష సూపర్ హిట్!



అమరావతి : పాదయాత్ర పుణ్యమో.. లేక, కుటుంబ నేపథ్యమో తెలియదు కానీ... కామన్ మేన్ కష్టాల విషయంలో జగన్ కు పరిపూర్ణమైన అవగాహన ఉందని అంటుంటారు కొంతమంది రాజకీయ పండితులు. కామన్ మేన్ చెప్పుకో లేని చిన్న చిన్న విషయాలను జగన్ గ్రహిస్తుంటారని.. ఆయన తీసుకునే నిర్ణయాలు చెబుతుంటాయని అంటున్నారు. ఈ సమయంలోనే సురక్ష తెరపైకి వచ్చింది. గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని ఓ అద్భుత కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని జగన్ భావించినట్లున్నారు. ఇందులో భాగంగా... ప్రభుత్వ సేవలు మరింత సులభతరం కావాలని చేసిన ఓ ప్రత్యేక ప్రయత్నం నెలపాటు కొనసాగి ఈమధ్యే ముగిసింది. తాజాగా ఈ కార్యక్రమం సక్సెస్ విషయాలు హల్ చల్ చేస్తున్నాయి. అవును... ఏపీ ప్రభుత్వం తాజాగా నిర్వహించిన కార్యక్రమం "జగనన్న సురక్ష"! ఈ ప్రత్యేక కార్యక్రమం జులై 1 నుంచి 31 వరకు నెలరోజులపాటు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎంతోమంది వాలంటీర్లు.. సచివాలయ, రెవెన్యూ సిబ్బంది స్వయంగా పాల్గొన్నారు. ప్రతి కుటుంబాన్ని పలకరించి, వారికి ప్రభుత్వంతో ఉన్న పనుల అవసరాలు తెలుసుకున్నారు. ప్రజల అవసరాలను తెలుసుకున్న అనంతరం వాటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజల ముంగిటకు ప్రభుత్వాన్ని తీసుకువచ్చే ఈ ప్రత్యేక కార్యక్రమం నాలుగు రోజుల క్రితం ముగిసింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15,004 గ్రామా సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. విద్య సంవత్సరం ప్రారంభం అయిన నేపథ్యంలో విద్యార్థులకు అవసరం అయ్యే కులం, ఆదాయం, నివాసం వంటి పలు ధ్రువీకరణ పత్రాలకు అక్కడే దరఖాస్తులు స్వీకరించడం.. వెనువెంటనే వాటిని మంజూరు చేయడం వంటి ప్రక్రియ నిర్వహించింది జగన్ సర్కార్. దీని ద్వారా ప్రజలకు డబ్బు, సమయం అదా అయ్యింది. గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు కలిసి ఈ క్రమంలో 93,57,707 సర్టిఫికెట్స్ మంజూరు చేసారు. దాదాపు 5.3 కోట్ల మందికి చేరువయ్యేలా చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో 1,46,27,905 కుటుంబాలను కలిసి దాదాపు 11 రకాల సర్టిఫికెట్లు.. రేషన్ కార్డుల్లో మార్పులు వంటివి చేపట్టి అక్కడికక్కడే మంజూరు చేశారు.

## పోలీసులను పరామర్శించిన మంత్రి పెద్దిరెడ్డి





చిత్తూరు: టీడీపీ రౌడీల దాడిలో గాయపడిన పోలీసులను చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు రాజకీయంగా దివాళా తీశారని.. అంతులేని ఆవేదన, ఆలోచనతో బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. "పుంగనూరు బైపాస్ నుంచి వెళ్తామని పోలీసులకు రూట్ మ్యాప్ ఇచ్చారు. ఆ తర్వాత కావాలనే పుంగనూరులోకి వెళ్లాలని ప్రయత్నించారు. అనంతరం పోలీసులపై విచక్షణా రహితంగా దాడి చేశారు. చంద్రబాబు రెచ్చగొట్టి టీడీపీ కార్యకర్తలను పోలీసులపై దాడి పాల్పడేలా చేశారు. అనరాని మాటలు తిడుతూ ప్రజలను రెచ్చగొట్టారు. పోలీసులపై ఈ స్థాయిలో దాడి జరిగిన ఘటనలు ఇటీవల కాలంలో లేవు. కుప్పంలో ఓడిపోతానన్న భయంతో చంద్రబాబు నీచానికి దిగారు" అని మంత్రి మండిపడ్డారు. "కచ్చితంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. పోలీసులకు, ప్రభుత్వానికి ఇది ప్రతిష్టాత్మకం. షార్ట్ గన్స్‌కు లైసెన్స్ ఉండదు.. కానీ వారు ఆయుధాలు తెచ్చుకున్నారు. 200 వాహనాల్లో రౌడీలను తెచ్చుకున్నారు" అని మంత్రి పెద్దిరెడ్డి ధ్వజమెత్తారు.

## పుంగనూరు ఘటనపై తెదేపా నేతల ఆగ్రహం.. గవర్నర్‌కు ఫిర్యాదు



అమరావతి: పుంగనూరు, తంబళ్లపల్లి ఘటనలపై గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను తెదేపా నేతల బృందం కలిసింది. గవర్నర్‌ను కలిసిన వారిలో వర్ల రామయ్య, నిమ్మల రామానాయుడు, బొండా ఉమ, గద్దె రామ్మోహన్, అశోక్ బాబు ఉన్నారు. శుక్రవారం నాటి దాడుల వీడియో క్లిప్పింగ్‌లు, ఫొటోలను గవర్నర్‌కు అందజేశారు.

**తాటాకు చప్పుళ్లకు భయపడం :** మరోవైపు, పుంగనూరు ఘటనపై తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని జగన్ ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని విమర్శించారు. వైకాపా ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే దాడులు, హత్యలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు పల్నాడులోనూ తెదేపా సానుభూతిపరుడు కోటయ్యపై వైకాపా నేత కృష్ణమూర్తి దాడి చేశాడని మండిపడ్డారు. పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు కోటయ్యపై వైకాపా గూండాలు రెండోసారి దాడికి తెగబడ్డారని ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేయకుండా వైకాపా నేతలకు కాపుగాస్తున్నారని విమర్శించారు. ఎన్ని దాడులు చేసినా జగన్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడమని.. అరాచకాలపై పోరాటం కొనసాగిస్తామని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**పెద్దిరెడ్డి అరాచకం రాష్ట్రమంతా చూసింది: తెదేపా –** మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచకం రాష్ట్రమంతా చూసిందని తెదేపా నేతలు మండిపడ్డారు. చంద్రబాబు పులివెందుల పర్యటన విజయవంతం కావడంతో వైకాపా నేతలకు దిక్కుతోచని పరిస్థితి ఉందన్న నేతలు.. అందుకే పుంగనూరులో అల్లర్లు ప్రేరేపించారని ఆరోపించారు. చిత్తూరు జిల్లా ఎవరి జాగీరు కాదని, పుంగనూరు బైపాస్ నుంచి చంద్రబాబు వెళ్తుంటే దాడి చేయించాలని పెద్దిరెడ్డి కుట్ర పన్నారంటూ.. నేతలు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు దుయ్యబట్టారు. చంద్రబాబుకి స్వాగతం పలికేందుకు వచ్చిన తెలుగుదేశం శ్రేణుల్ని పోలీసులే అనవసరంగా రెచ్చగొట్టారన్నారు.

## మరూరు టోల్ గేట్ వద్ద జాతీయ రహదారిపై పరిటాల సునీత బైఠాయింపు




చెన్నెకొత్తపల్లి: పుంగనూరులో తెదేపా శ్రేణులపై రాళ్లదాడిని నిరసిస్తూ ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో తెదేపా నాయకులు శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా తెదేపా నాయకులపై పోలీసులు ఆంక్షలు విధించారు. నిరసనలు తెలపటానికి అనుమతి లేదంటూ ఎక్కడికక్కడ గృహ నిర్బంధాలు చేశారు. మాజీ మంత్రి పరిటాల సునీత చెన్నెకొత్తపల్లిలో నిరసన తెలపటానికి వెళ్తుండగా 44వ జాతీయ రహదారిపై మరూరు టోల్ గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. తాము శాంతియుతంగా నిరసనలు తెలపటానికి వెళ్తున్నామని సునీత చెప్పినా.. పోలీసులు వినకపోవటంతో ఆమె జాతీయ రహదారిపై కార్యకర్తలతో కలిసి బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసుల తీరుపై మండిపడ్డారు. మరోవైపు హిందూపురంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు రమేశ్‌తో పాటు పలువురు తెదేపా నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. నిరసనలకు అనుమతించొద్దని.. పైఅధికారుల నుంచి తమకు ఆదేశాలు వచ్చినట్లు పోలీసులు చెబుతున్నారని తెదేపా నేతలు ఆరోపించారు. ఈక్రమంలోనే పోలీసులు తమను అడ్డుకుంటున్నట్లు వెల్లడించారు.

# పవన్ కి మెగా ఫ్యామిలీ ఫుల్ సపోర్ట్...స్ట్రాటజీ అదే...?



అమరావతి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన పార్టీ కోసం తానుగానే కష్టపడుతున్నారు. ఇప్పటిదాకా ఆయన పార్టీ తరఫున ప్రచారం చేయడానికి మెగా ఫ్యామిలీ నుంచి ఏ ఒక్క నటుడూ రాలేదు. 2019 ఎన్నికల్లో అయితే పవన్ కళ్యాణ్ మొత్తం ప్రచారం తానే నిర్వహించారు. అయితే బ్యాడ్ రిజల్ట్ వచ్చింది. ఈసారి జనసేనకు కొన్ని ఆశలు ఉన్నాయి. దానికి తగినట్లుగా జనంలో పార్టీకి గ్రాఫ్ పెరిగింది అని అంటున్నారు. ఈ నేపథ్యంలో గట్టిగా పట్టుకుంటే కనుక జనసేన జెండా ఎగరేయడం ఖాయమని అంటున్నారు. అందుకే ఈసారి పవన్ కి టోటల్ గా మెగా ఫ్యామిలీ ఫుల్ సపోర్ట్ ఇస్తుంది అని ప్రచారం సాగుతోంది. దానికి తగినట్లుగా మెగా ఫ్యామిలీ యంగర్ జనరేషన్ హీరోలు స్టేట్మెంట్స్ ఇస్తున్నారు. తాజాగా వుడిదలై థియేటర్లలో నడుస్తున్న బ్రో సినిమా యూనిట్ ఏపీలో పర్యటిస్తోంది. విజయవాడ కనక దుర్గమ్మ వారిని యూనిట్ మెంబర్స్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హీరో సాయి ధర్మ తేజ్ అయితే పవన్ గురించి జనసేన పార్టీ గురించి హాట్ కామెంట్స్ చేశారు. తామనతా పవన్ వెంటే ఒకే ఒక బోల్డ్ స్టేట్మెంట్ ఇచ్చి పడేశారు. మాకు రాజకీయాలు తెలియవు. కానీ పవన్ కోసం మాత్రం మేమంతా ఉంటామని తేజ్ చెప్పడం అంటే అది కచ్చితంగా తెర వెనక అంతా ఒక్కటి అవుతున్నారని అంటున్నారు. నిజానికి చూస్తే 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం కోసం మెగా ఫ్యామిలీ అంతా ప్రచారంలోకి వచ్చిన సంగతి గుర్తు ఉండే ఉంటుంది. అప్పట్లో రాం చరణ్, అల్లు అర్జున్ తో పాటు చాలా మంది హీరోలు వచ్చి ప్రజారాజ్యం జెండాను ఎగరేశారు. ఇక 2024 ఎన్నికల్లో కూడా అలాంటి పరిస్థితి ని చూడవచ్చు అని అంటున్నారు.

ఇటీవల బ్రో సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ లో వరుణ్ తేజ్ తో పాటు ఇతర హీరోలు కూడా పవన్ కోసం తామంతా ఉన్నామని గట్టిగా చెప్పారు. ఇపుడు చూస్తే సాయి ధర్మ తేజ్ తమ కుటుంబ సభ్యులు అంతా ఏకమొత్తంగా మద్దతుగా నిలుస్తామని చెప్పడం అంటే దాన్ని రాజకీయంగా కీలకమైన పరిణామంగా చూడాల్సి ఉంది అని అంటున్నారు. మరి అదే కనుక నిజమైతే వచ్చే ఎన్నికల్లో జనసేన ఒంటరిగా పోటీకి దిగుతుందా అన్నది కూడా మరో వైపు చర్చకు వస్తోంది. ఎందుకంటే పవన్ సీఎం అని అంటేనే మెగా ఫ్యామిలీ అంతా ప్రచారంలోకి వస్తుంది. అలా కాకుండా పొత్తులు ఉంటే మాత్రం ప్రచారానికి ఎంత మంది వస్తారో అన్నది కూడా చూదాలని అంటున్నరు. ఏది ఏమైనా ఈసారి జనసేన బరిలోకి దిగడం గట్టిగానే అని అంటున్నారు పదేళ్లు రాజకీయ అనుభవాన్ని పవన్ ఈసారి చూపిస్తారు అని అంటున్నారు.




## అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఘోర ప్రమాదం.. ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చేసి తిరిగొస్తుండగా..!

ఓ వ్యక్తి కారు కొన్నాడు.. ఆ ఆనందంలో ఫ్రెండ్స్‌కు పార్టీ ఇచ్చాడు..! ఫ్రెండ్స్‌తో కలిసి ఎంజాయ్ చేశాడు..! కాసేపు ఆగి ఉంటే అన్నీ సవ్యంగానే జరిగేవి.! ఇంతలోనే ఊహించని ప్రమాదం.. ఆ కారే బలితీసుకుంది!. కారులో బయలుదేరిన ఫ్రెండ్స్ మరణంలో కూడా తోడుగా వెళ్లారు!. హైవేపై వెళ్తుండగా.. ఒక్కసారిగా అదుపుతప్పి చెట్టును ఢీకొన్నది. కారు కొన్న ఆ ఆనందం ఎన్నో గంటలు ఆగలేదు..! కారు యజమానితో పాటు మరో ఇద్దరు దుర్మరణం చెందగా.. మరొకరు కొనప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు! అనంతపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.

జిల్లాలోని తాడిపత్రి మండలం, రావి వెంకటం పల్లి గ్రామం వద్ద శనివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తాడిపత్రి హైవేపై అదుపుతప్పిన కారు చెట్టును ఢీకొన్నది. కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. సెకండ్స్‌లో శుక్రవారం నాడు కారు తీసుకున్న మోహన్ రెడ్డి.. ఆ ఆనందంలో ఫ్రెండ్స్‌కు పార్టీ ఇచ్చాడు. ఫ్రెండ్స్ అంతా ఫుల్ తినేసి ఎంజాయ్ చేసిన ఆ ఆనంద సమయాలను గుర్తు చేసుకుంటూ తిరిగి ప్రయాణం చేశారు.. తిరిగి వస్తుండగా కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో కారు యజమాని మోహన్ రెడ్డితో పాటు ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా.. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. కారు కొన్నామనే ఆనందంలో మునిగితేలిన ఆ కుటుంబంలో పెనువిషాదం నెలకొంది. అయితే.. మద్యం మత్తు, అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమిక అంచనా వేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




**రాష్ట్రంలో వైకాపా నేతల దెబ్బకు కొండలు, గుట్టలు, వాగులు మాయం అవ్వవతున్నాయని తెదేపా ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. యువగళం పాదయాత్రలో భాగంగా వినుకొండ నియోజవర్గం ఈపూరు పుచ్చకాయల బోడులోని కొండ వద్ద లోకేశ్ సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. 3.16 ఎకరాల విస్తీర్ణంలోని కొండను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నేతృత్వంలో ఆయన అనుచరులు ఇష్టారాజ్యంగా తవ్వేసి కోట్లాది రూపాయలు దన్నుకున్నారని లోకేశ్ ఆరోపించారు.**




ఇంఫాల్: జాతుల మధ్య వైరంతో అట్టుడుకుతోన్న ఈశాన్య రాష్ట్రం మణిపుర్‌లో హింసాత్మక ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా బిష్ణుపుర్ జిల్లాలో దుండగులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి మళ్లీ హింస చెలరేగింది. మృతిచెందిన వారు క్వాక్టా ప్రాంతంలోని మైతేయి వర్గానికి చెందిన వారని తెలుస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి వీరు తమ ఇళ్లకు కాపాలా కాస్తుండగా గుర్తుతెలియని దుండగులు వీరిపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తండ్రీకుమారుడితో పాటు మరో వ్యక్తి మరణించారు. నిందితులను మిలిటెంట్లుగా అనుమానిస్తున్నారు. కేంద్ర భద్రతా దళాల బఫర్‌జోన్‌ను దాటుకుని దుండగులు గ్రామంలోకి చొరబడి కాల్పులు జరపడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో క్వాక్టాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. ఈ ఘటన జరిగిన కాసేపటికే ఈ ప్రాంతంలో కుకీ వర్గానికి చెందిన ఇళ్లకు ఆందోళనకారులు నిప్పంటించారు. వెంటనే రంగంలోకి దిగిన భద్రతా సిబ్బంది వారిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో భీకర కాల్పులు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. క్వాక్టా ప్రాంతంలో భద్రతా బలగాలు, ఆందోళనకారుల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయని అధికారిక వర్గాల సమాచారం. ఈ కాల్పుల్లో మణిపుర్ కమాండో ఒకరు గాయపడినట్లు తెలుస్తోంది. దీంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు. అటు పారామిలిటరీ బలగాలు భారీగా మోహరించాయి. ప్రస్తుతం బిష్ణుపుర్‌లో పరిస్థితులు క్లిష్టంగానే ఉన్నాయని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే బిష్ణుపుర్‌లో గురువారం రాత్రి అల్లరిమూకలు రెచ్చిపోయి ఆయుధాలను లూటీ చేసిన విషయం తెలిసిందే. నారన్సీనా ప్రాంతంలో రెండో బారత రిజర్వ్ బెటాలియన్ (ఐఆర్‌బీ) ప్రధాన కార్యాలయంలోని పోలీసు ఆయుధాగారంపై దాడి చేసి భారీగా ఆయుధ సామగ్రిని ఎత్తుకెళ్లారు. అంతకుముందు రెండు రోజుల క్రితం భద్రతాబలగాలు, ఆందోళనకారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకుని 17 మంది గాయపడ్డారు.

# నాలుగు పదులు దాటినా అవే పరువాలు

1991 సంవత్సరంలో విషకన్య అని హిందీ సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా నటించి ఇండస్ట్రీకి పరిచయం అయిన ముద్దుగుమ్మ రియా సేన్. ఈ అమ్మడు హీరోయిన్గా ఎన్నో సినిమాల్లో నటించింది. నాలుగు పదుల వయసుకు చేరువైన సమయంలోను నటిగా బిజీగా ఉండేది. ప్రస్తుతం ఈ అమ్మడి వయసు 42 ఏళ్లు. ఈ వయసులో కూడా అందాల ఆరబోత ఫోటోలతో సోషల్ మీడియాలో జనాలను చంపేస్తోంది. సాధారణంగా రెండు పదుల వయసు హీరోయిన్స్ కి మాత్రమే సోషల్ మీడియాలో ఎక్కువ ఫాలోయింగ్ ఉంటుంది.. కానీ రియా సేన్ నాలుగు పదుల వయసు దాటినా కూడా అందాల ఆరబోత



కారణంగా మంచి ఫాలోయింగ్ ని దక్కింది. తాజాగా మరోసారి క్లి వేజ్ షేర్ చేస్తూ సోషల్ మీడియాలో తన కొత్త ఫోటోలను షేర్ చేసింది. ఎప్పటి లాగే ఈ ఫోటోలు కూడా వైరల్ అవు తున్నాయి. ఈ రేంజ్ ఫోటోలు యంగ్ హీరోయిన్స్ కూడా షేర్ చేయడం లేదంటూ కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే మరి కొందరు మాత్రం ఈ వయసులో ఇంత అందం ఏంట్రా బాబోయ్ అని కామెంట్స్ చేస్తూ ఉన్నారు.

ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేస్తుంది కనుకే ఇప్పటికీ కూడా సినిమాలు సిరీస్లు అంటూ బిజీగా కొనసాగుతోంది. ఇదే అందాల ఆరబోత కొనసాగిస్తే మరో 10 సంవత్సరాల పాటు కూడా ఈమెని జనాలు అభిమానించే అవకాశాలు ఉన్నాయి.. ఇండస్ట్రీ లో కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

## చూపులతో కవ్విస్తున్న ఇస్మార్ట్ బ్యూటీ

2015 లో వజ్రకాయ అనే కన్నడ సినిమా తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నభా నటేష్. తెలుగు లో ఈ అమ్మడు సుధీర్ బాబు హీరోగా నటించిన 'నన్ను దోచుకుందువటే' సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమా మంచి మార్కులు తెచ్చి పెట్టడంతో వరుస ఆఫర్లు వచ్చాయి. ఇస్మార్ట్ శంకర్ సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుని టాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా మారుతుందని అంతా భావించారు. కానీ ప్రస్తుతం ఈ అమ్మడు పెద్దగా సినిమాలు చేయడం లేదు. ఈమెకు ఆఫర్లు పెద్దగా వస్తున్న దాఖలాలు కూడా కనిపించడం లేదు. అయినా కూడా ఎప్పటికప్పుడు అందాల ఆరబోత కారణంగా వార్తల్లో నిలుస్తోంది.



నభా నటేష్ తాజాగా షేర్ చేసిన ఫోటోలు నెటిజన్స్ ను కవ్విస్తున్నాయి. ఈ అమ్మడి కొరికేసే చూపులు మతి పోగొడుతున్నాయి అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

మరీ ఇంతగా కవ్విస్తూ ఉంటే తట్టుకోగలమా అంటూ నభా నటేష్ ను సరదాగా కోప్పడుతున్నారు. క్లీ వేజ్ షో తో డిఫరెంట్ ఔట్ ఫిట్ లో ఈ అమ్మడి అందాల ఆరబోతకు ఎంతటి వారైనా ఫిదా అవ్వాల్సిందే. ఇంతటి అందం కలిగి ఉన్న ఈ అమ్మడికి పాపం ఎందుకు సినిమాల్లో ఎక్కువగా ఆఫర్లు రావడం లేదో అర్థం కావడం లేదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోలు చూసిన తర్వాత అయినా ఫిల్మ్ మేకర్స్ ఆఫర్లు ఇస్తారేమో చూడాలి.




# బాలయ్య 1 రవితేజ 5.. మరి ఈ సారి విన్నర్ ఎవరో..






పోటీ ఉంటేనే సత్తా అవతలి వ్యక్తి ఖలేజా ఏంటో తెలుస్తుంది. చిత్ర పరిశ్రమలోనూ అంతే. స్టార్ హీరోల మధ్య బాక్సాఫీస్ వార్ ఉంటేనే ఆడియెన్స్ తో పాటు ఫ్యాన్స్ లో కిక్ ఉ ంటుంది. బాక్సాఫీస్ షేక్ అవుతుంది. ప్రతి సీజన్ లోనూ ఇలాంటి వార్ జరుగుతూనే ఉంటుంది. అయితే త్వరలోనే దసరా సీజన్ రాబోతుంది. ఈ సీజన్ లో బాలయ్య వర్సెస్ రవితేజ పోరుకు సిద్ధమవుతున్నారు. బాలయ్య 'భగవంత్ కేసరి'గా రానుండగా.. రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు'గా సందడి చేయనున్నారు. అయితే వీరిద్దరు ఇప్పుడే కాదు గతంలోనూ పలుసార్లు తమ చిత్రాలతో తలపడ్డారు. మరి ఆ చిత్రాలేంటి, అప్పుడు ఎవరు పైచేయి సాధించారో తెలుసుకుందాం.. 'పలనాటి బ్రహ్మనాయుడు'గా నందమూరి బాలకృష్ణ జూన్ 13, 2003లో బాక్సాఫీస్ ముందుకు రాగా.. ఆరు రోజుల గ్యాప్ లో 'ఒక రాజు ఒక రాణి' అంటూ జూన్ 19 ఆడియెన్స్ ముందుకు వచ్చారు రవితేజ. అయితే ఈ రెండు చిత్రాలు ఆకట్టుకోలేకపోయాయి. 2005లో అక్టోబర్ 5న బాలయ్య 'అల్లరి పిడుగు'తో ముందుకు రాగా.. రవితేజ 'భగీరథ' అక్టోబర్ 13న అభిమానులను పలకరించింది. ఇందులో భగీరథ పర్వాలేదనిపించగా... అల్లరి పిడుగు నిరాశ పరిచింది. 2008లో సంక్రాంతికి 'ఒక్కమగాడు'గా(జనవరి 11) బాలయ్య సందడి చేయగా.. జనవరి 12న రవితేజ 'కృష్ణ'గా వచ్చారు. రవితేజ కృష్ణ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. 2009లో మే1న బాలకృష్ణ 'మిత్రుడు' మూవీతో పలకరించగా.. వారం గ్యాప్‌లో వచ్చిన 'కిక్'.. రవితేజ మరో భారీ హిట్ ను అందించింది. మిత్రుడు ఫ్లాప్ అయింది. బాలకృష్ణ 'పరమవీరచక్ర' 2011 సంక్రాంతికి రాగా జనవరి 12న రవితేజ మిరపకాయ్ వచ్చింది. మళ్లీ రవితజే 'మిరపకాయ్' సూపర్ హిట్ గా నిలిచింది.

2012లో 'దరువు' అంటూ మే 25న బాక్సాఫీస్ ముందు సందడి చేయగా.. వారం గ్యాప్‌తో జూన్ 1న వచ్చిన బాలయ్య 'అధినాయకుడు' బోల్తా కొట్టింది. 2012 ఆగస్ట్ 15న రవితేజ 'దేవుడు చేసిన మనుషులు' అట్టర్ ఫ్లాప్ అవ్వగా.. రెండు వారాల గ్యాప్‌లో వచ్చిన బాలకృష్ణ 'శ్రీమన్నారాయణ' ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. 2023లో బాలకృష్ణ 'వీర సింహా రెడ్డి' బ్లాక్ బస్టర్ హిట్ అవ్వగా.. ఆ మరుసటి రోజే వచ్చిన 'వాల్తేరు వీరయ్య'లో బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ సారి దసరా సీజన్ లో బాలయ్య అక్టోబర్ 19న 'భగవంత్ కేసరి'గా రానున్నారు. ఆ తర్వాతి రోజే అక్టోబర్ 20న రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు'గా పోటీకి సిద్ధమవుతున్నారు. మరి ఈ బాక్సాఫీస్ పోరులో ఎవరు గెలుస్తారో చూడాలి..

# పెళ్లెప్పుడంటే.. అయిపోయిందంటూ రష్మిక ట్విస్ట్





టాలీవుడ్ హాట్ బ్యూటీల్లో రష్మిక ఒకరు. ఛలో మూవీతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ కన్నడ బ్యూటీ, వరస అవకాశాలు అందుకొని ముందుకు దూసుకుపోతోంది. కాగా, ఈ బ్యూటీ టాలీవుడ్ లోకి అడుగుపెట్టకముందే, కన్నడ హీరో రోహిత్ శెట్టిని ప్రేమించి ఎంగేజ్మెంట్ కూడా చేసుకుంది. కానీ, ఆ తర్వాత పెళ్లిని క్యాన్సిల్ చేసుకుంది. అయితే, టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండతో ఆమె ప్రేమలో ఉంది అనే ప్రచారం అయితే జరుగుతూ ఉంటుంది. వీరిద్దరూ త్వరలో పెళ్లి చేసుకుంటారని ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. అయితే, తాజాగా ఆమె తన పెళ్లి గురించి షాకింగ్ కామెంట్స్ చేశారు. తనకు ఆల్రెడీ పెళ్లి అయిపోయింది అంటూ ఆమె షాకిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా క్రేజ్ ఉన్న ఓ వ్యక్తిని తాను ఇష్టపడ్డానని ఆమె చెప్పారు. ఇంతకీ ఆ వ్యక్తి ఎవరో కాదు నరుటో. చిన్న పిల్లలు ఇష్టంగా టీవీలో చూసే క్యారెక్టర్ నరుటో. జపనీస్ వెబ్ సెరిస్ నరుటో లో ప్రధాన పాత్ర అది. ఈ క్యారెక్టర్ కి ప్రపంచ వ్యాప్తంగా ఫ్యాన్స్ ఉన్నారు. రష్మిక కూడా ఆ క్యారెక్టర్ ని విపరీతంగా అభిమానిస్తోంది. అందుకే, ఆ క్యారెక్టర్ తో తన పెళ్లి అయిపోయిందని సరదాగా చెప్పింది. నరుటో ని తాను ప్రేమిస్తున్నాన ని, అతనితో తనకు ఎప్పుడో పెళ్లి అయిపోయిందని, అతనే తన మనసు లో ఉన్నాడు అంటూ ఆమె చెప్పింది. బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ తో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు పైవిధంగా ఆమె సమాధానం ఇవ్వడం విశేషం. ఆమె సమాధానం విని, అక్కడ ఉన్న మీడియా వారితో సహా పక్కనే ఉన్న టైగర్ ష్రాఫ్ కూడా షాకవ్వడం విశేషం.

ఇదిలా ఉండగా, రష్మిక ప్రస్తుతం టాలీవుడ్ లో అల్లు అర్జున్ సరసన పుష్ప2లో నటిస్తోంది. దీంతో పాటు, నితిన్ తో ఓ సినిమా చేయాల్సి ఉంది. కానీ, కొన్ని కారణాల వల్ల ఆ మూవీ నుంచి రష్మిక తప్పుకుంది. అయినా, రష్మిక చేతిలో బాలీవుడ్ లో సినిమాలు ఉన్నాయి. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన రణబీర్ కపూర్ యానిమల్ చిత్రం లో రష్మిక హీరోయిన్ గా నటిస్తోంది. కాగా, ఈ మూవీలో తన పాత్ర కోసం షూటింగ్ ఇటీవల పూర్తి చేసుకుంది. ఈ చిత్రాని కి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# టాలీవుడ్ కి తాప్సి కౌంటర్

మంచు మనోజ్ హీరో గా నటించిన ఝుమ్మంది నాదం సినిమా లో హీరోయిన్ గా నటించడంతో తెలుగు ప్రేక్షకుల కు పరిచయం అయిన ముద్దుగుమ్మ తాప్సి. తెలుగు లో ఈ అమ్మడికి స్టార్ హీరో సినిమాల్లో నటించే అవకాశాలు లభించాయి. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో ఈ అమ్మడికి ఏ ఒక్క సినిమా కూడా స్టార్ హీరోయిన్ స్టేటస్ తెచ్చి పెట్టలేకపోయాయి. టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ స్టేటస్ రాకపోవడంతో బాలీవుడ్ లో ప్రయత్నాలు మొదలు పెట్టింది. అక్కడ జీరో నుండి తాప్సి కెరియర్ ఆరంభించింది. అదృష్టం కలిసి రావడంతో అక్కడ వరుసగా సినిమాలు దక్కించుకుంటూ స్టార్ హీరోయిన్ హోదాను సొంతం చేసుకుంది. అదే సమయంలో సౌత్ లో కూడా అవకాశాలు వచ్చినప్పుడు నటిస్తూనే ఉంది. కొంత మంది హీరోయిన్స్ ఇక్కడ సక్సెస్ దక్కించుకుంటే అక్కడ ఫెయిల్ అవుతారు.. మరి కొందరు హీరోయిన్స్ ఇక్కడ ఫెయిల్ అయితే అక్కడ సక్సెస్ అవుతారు. కొద్దిమంది మాత్రమే ఇక్కడ అక్కడ సక్సెస్ ని సొంతం



చేసుకుంటారు. తాప్సి ఇక్కడ సక్సెస్ లను సొంతం చేసుకోలేక పోయింది. కానీ బాలీవుడ్లో మాత్రం స్టార్ హీరోయిన్గా గుర్తింపు దక్కించుకుంది. టాలీవుడ్ లో తాప్సి సక్సెస్ దక్కించుకోక పోవడం పట్ల అప్పట్లో విమర్శలు వ్యక్తం అయ్యాయట. ఆ విషయమై తాప్సి ఒకానొక సందర్భంలో మాట్లాడుతూ.. నేను తెలుగు సినిమాల్లో నటించిన సందర్భంగా కొన్ని సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. దాంతో చాలా మంది నన్ను విమర్శించారు. నేను దురదృష్టవంతురాలిన అంటూ నిందించారు. సినిమాలు ఆడక పోవడానికి కారణం నేనే అన్నట్లుగా ఆ సమయంలో కొందరు విమర్శలు చేశారు. నిజానికి నేను సినిమా ఇండస్ట్రీకి చెందిన ఫ్యామిలీ నుండి వచ్చిన దాని ని కాదు. ఇండస్ట్రీ బ్యాక్ గ్రౌండ్ లేకపోవడంతో కెరియర్ ఆరంభం లో సినిమాల ఎంపిక విషయంలో అవగాహన లేకపోవడంతో కొన్ని తప్పిదాలు చేసిన మాట వాస్తవం. ఆ తప్పుల నుండి పాఠాలు నేర్చుకున్నాను. ఆ పాటలు నేర్చుకునే క్రమంలో నేను చాలా మంది విమర్శల కు గురయ్యాను. కొన్ని సినిమాల్లో నేను పాటల కు, ఒకటి రెండు సన్నివేశాల కు మాత్రమే పరిమితమైన పాత్రల ను చేశాను. అందువల్ల కూడా నన్ను విమర్శించారని ఆవేదన వ్యక్తం చేసినట్లుగా మాట్లాడుతూనే టాలీవుడ్ కి కౌంటర్ ఇచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్లో ఈమె సినిమాల కు మంచి డిమాండ్ ఉన్న విషయం తెలిసిందే.

# దేవర : ఏడాది పాటు ఇదే కోరుకున్నా.. జాన్వీ కపూర్

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన జాన్వీ కపూర్ కు తల్లి స్టార్ డమ్ పెద్దగా కలిసి రాలేదు. ఇండస్ట్రీలో శ్రీదేవి కూతురుగా బాలీవుడ్ లో అడుగు పెట్టగలిగింది కానీ సక్సెస్ లు మంచి పాత్రలు అందుకోవడంలో మాత్రం విఫలం అయింది. జాన్వీ కపూర్ ప్రస్తుతం టాలీవుడ్ లో ఎంట్రీకి రెడీ అయింది. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం లో రూపొందుతున్న 'దేవర' సినిమా లో ముద్దుగుమ్మ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెల్సిందే. బాలీవుడ్ లో దక్కని సక్సెస్ ను టాలీవుడ్ లో అయినా దక్కించుకోవాలనే ఆశతో జాన్వీ కపూర్ ఎదురు చూస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో జాన్వీ కపూర్ మాట్లాడుతూ.. దేవర సినిమా ప్రకటించిన తర్వాత



ఏడాది పాటు తాను ఆ సినిమాలో ఉండాలని కోరుకున్నాను. ఎన్టీఆర్ తో కలిసి నటించాలని చాలా కాలంగా ఎదురు చూస్తున్న తనకు దేవర సినిమా తో ఛాన్స్ దక్కినందుకు చాలా సంతోషంగా ఉందని జాన్వీ కపూర్ పేర్కొంది. ఎన్టీఆర్ తో కలిసి నటించే అవకాశం రావడంతో నా కోరిక తీరింది. ప్రస్తుతం ఆయనతో కలిసి షూటింగ్ లో పాల్గొంటూ ఉండటం ఆనందంగా ఉంది. ఎన్టీఆర్ తో నటించాలనే కోరిక తీరిందని.. అయితే హృతిక్ రోషన్, రణవీర్ సింగ్, టైగర్ ష్రాఫ్ లతో కలిసి నటించాల ని ఉందంటూ కూడా జాన్వీ కపూర్ పేర్కొంది. ఇక బాలీవుడ్ స్టార్ ఫిల్మ్ మేకర్ కరణ్ జోహార్ దర్శకత్వంలో ఒక సినిమాలో అయినా నటించాలని తన కోరిక అంటూ జాన్వీ కపూర్ పేర్కొంది. మొత్తానికి ఈ అమ్మడి కోరికల జాబితా.. డ్రీమ్ ప్రాజెక్ట్ ల జాబితా చాలా పెద్దగానే ఉంది. దేవర సినిమా సక్సెస్ అయితే ఈమెకు టాలీవుడ్ లో స్టార్ హీరోల కు జోడీగా నటించే అవకాశాలు దక్కవచ్చు.

